TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND GUNTUR

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 200 శుక్రవారం, జూన్ 05, 2026 పేజీలు :8 వెల.1/-




# 2029 ఎన్నికలే టార్గెట్..

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు?



భారత రాజకీయ చిత్రపటాన్ని మార్చేసే అత్యంత కీలకమైన నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రం భావిస్తోందని.. ఇందుకు సంబంధించి ఓ కొత్త బిల్లును తీసుకువచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని సమాచారం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా దేశంలోని పార్లమెంటు నియోజకవర్గాల సరిహద్దులు పూర్తిగా మారనున్నాయి. అయితే దీనిపై రాజకీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముందుగా రాజకీయ పార్టీల మధ్య ఒక ఏకాభిప్రాయాన్ని తీసుకురావడానికి కేంద్రం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును చట్టంగా మార్చే ముందు దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు, కీలక భాగస్వాములతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే దక్షిణాదికి చెందిన డీఎంకే, పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ సహా పలు ఇతర ప్రాంతీయ పార్టీలతో కేంద్ర ప్రతినిధులు చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ చర్చల ప్రక్రియ అత్యంత కీలకమైన సమయంలో జరుగుతోంది. ప్రస్తుతం దేశంలోని లోక్‌సభ స్థానాల కేటాయింపు అనేది 1971 జనాభా లెక్కల ఆధారంగా స్తంభింపజేయబడింది. ప్రస్తుత లోక్‌సభలో 543 మంది ఎన్నికైన సభ్యులు ఉండగా, ఈ రాజ్యాంగపరమైన గడువు ముగిసిన తర్వాత పునర్విభజన చేపడితే రాష్ట్రాల వారీగా ప్రాతినిధ్యంలో పెద్ద ఎత్తున మార్పులు రావడం ఖాయం. జనాభాను విజయవంతంగా నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు ఈ పునర్విభజన ప్రక్రియపై మొదటి నుంచీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. జనాభా నియంత్రణ పాటించినందుకు తమకు లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గిపోయి, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగితే అది తమకు జరిగే అన్యాయమని ఇక్కడి పార్టీలు వాదిస్తున్నాయి. ఈ ఆందోళనలను కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించిందని.. అందుకే అందరికీ ఆమోదయోగ్యమైన, సమతుల్యమైన ఒక కొత్త ఫార్ములాను రూపొందించే పనిలో పడిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన అనేది దేశంలో రాజకీయంగా ఎలాంటి వివాదాలకు దారితీయకుండా, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుతూ, న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించేలా ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్రం గట్టిగా ప్రయత్నిస్తోంది. ప్రాంతీయ పార్టీలతో ఇప్పటివరకు జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని, చట్టాన్ని ముందుకు తీసుకెళ్లే ముందే ఒక సమగ్రమైన రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉన్నట్లు సమాచారం. అన్ని పార్టీల మధ్య ఓ స్పష్టమైన అవగాహన, ఒప్పందం కుదిరిన వెంటనే కేంద్రం ఈ బిల్లుపై తదుపరి అడుగులు వేయనుంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ముందు దేశంలో జరగబోయే అత్యంత ప్రభావవంతమైన రాజకీయ, రాజ్యాంగపరమైన ప్రక్రియలలో ఈ నియోజకవర్గాల పునర్విభజన ఒకటి కానుంది. ఇది దేశ పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని, కేంద్ర-రాష్ట్రాల సంబంధాలను, దేశ భవిష్యత్తు ఎన్నికల ముఖచిత్రాన్ని శాసించే అవకాశం ఉంది.

# ఈ నెల 8న ఇండియా కూటమి పక్షాల భేటీ



హైదరాబాద్ : వివిధ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం, కూటమిలో నెలకొన్న అభిప్రాయ భేదాల నేపథ్యంలో విపక్షాల 'ఇండియా' కూటమి పార్టీలు 8 న ఢిల్లీలో భేటీ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వంపై ఉమ్మడి కార్యాచరణ ప్రకటించడం, ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేయడం ఈ భేటీ ప్రధాన లక్ష్యాలు. ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, నిరుద్యోగం, పరీక్షా పత్రాల లీకేజీలు వంటి ప్రజా సమస్యలపై సంయుక్త పోరాటానికి వ్యూహాలు ఖరారు చేయనున్నారు.

# తెలంగాణకు కేంద్రం తీపికబురు..

## రూ.7,597 కోట్లతో రెండు జాతీయ రహదారుల విస్తరణకు ఆమోదం



తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు రవాణా నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో రవాణా రద్దీని తగ్గించి, జిల్లాల మధ్య అనుసంధానతను పెంచేందుకు వీలుగా రెండు భారీ జాతీయ రహదారుల విస్తరణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. మొత్తం రూ. 7,597 కోట్ల అంచనా వ్యయంతో, సుమారు 190 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారులను నాలుగు వరుసల మార్గాలుగా విస్తరించనున్నారు. ఈ ప్రాజెక్టు కింద విస్తరించబోయే మొదటి రహదారి ఆర్మూర్ - జగిత్యాల - మంచిర్యాల ఔఊ-63. ఈ మార్గాన్ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ఊంఓ పద్ధతిలో నిర్మించనున్నారు. ఇది నిజామాబాద్, జగిత్యాల మరియు మంచిర్యాల జిల్లాల మీదుగా సాగుతుంది. రెండవది జగిత్యాల - కరీంనగర్ జాతీయ రహదారి ఔఊ-563. దీనిని బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ ఖు విధానంలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఔఊంఎ ఇప్పటికే ఈ పనులకు సంబంధించిన ప్రాథమిక ప్రక్రియను గతంలోనే పూర్తి చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ కొత్త రహదారులను గంటకు గరిష్టంగా 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణించేలా అత్యాధునిక ప్రమాణాలతో డిజైన్ చేశారు. ప్రస్తుతం తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఎదుర్కొంటున్న అంక్సాపూర్, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, లక్షెట్టిపేట, మంచిర్యాల, గంగాధర మరియు పోతారం వంటి ప్రధాన పట్టణాల పరిధిలో బైపాస్ రోడ్లను నిర్మిస్తారు. ఈ విస్తరణ పనులు పూర్తయితే ఆర్మూర్ నుండి మంచిర్యాల మధ్య ప్రయాణ సమయం సుమారు గంటన్నర తగ్గుతుంది.

# తెలంగాణ ఉద్యమ కారుల గుర్తిమప్పు

హైదరాబాద్,జూన్ సచివాలయంలో మీడియా సమావేశంలో కే.కేశవరావు, ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ప్రభుత్వం కమిటీ వేసింది..దాని కోసం ఆల్ పార్టీ మీటింగ్ పెట్టడం జరిగింది..ఉద్యమకారులు గుర్తించడానికి గుర్తించిన పార్టీలతో , ఉద్యమం సంబధం ఉన్న పార్టీలతో సమావేశం ఏరియా చేయడం జరిగింది..వారు ఏం కోరుకుంటున్నారు.. ఒపినియన్ ఏంటి అనేదానిపై సలహాలు సూచనలు స్వీకరించడం జరిగింది. విద్యార్థి సంఘాలను, అడ్వకేట్ ,డాక్టర్ , ఉద్యమం తో సంబంధం ఉన్న వారిని కూడా పిలిచి మాట్లాడతాం..ఇందులో మొదటిది ఉద్యమకారులను గుర్తించడం తొలి తరం ఉద్యమకారులను గుర్తించడానికి చర్యలు తీసుకుంటాం..ఉద్యమకారుల ఐడెంటిటీ పై వర్క్ డివైడ్ చేస్తాం. సమావేశానికి హాజరైన ప్రతి పార్టీలు ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అభినందించారు..ఇది రెండవ మీటింగ్ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తీసుకున్నాం..తెలంగాణ కు మద్దతు ఇచ్చిన పార్టీలు అని ఐక్యంగా అందరివీ తీసుకున్నాం..కమిటీ నివేదిక కు టైమ్ బాండ్ ఆలోచిస్తున్నాం..మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ అఖిలపక్ష పార్టీలను ఇద్దరి చొప్పున పిలవడం జరిగింది..పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ ,విద్యార్ , జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతాం..గాయాలు వివిధ విభాగాలు గా నష్టం జరిగిన వారికి న్యాయం చేస్తాం..కవులు ,కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తించి దీని కార్యాదీని అమరవీరుల ద్వీపం లో ప్రారంభం అవుతుంది..ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని గుర్తించాలని అందరి వద్ద సూచనలు స్వీకరించడం జరిగింది..రాజకీయాలకు అతీతంగా సలహాలు సూచనలు స్వీకరిస్తాం.. ఆన్లైన్ ఆఫ్ లైన్ లో విజ్ఞప్తులు స్వీకరిస్తాం..కోదండరాం ఎమ్మెల్సీ మాట్లాడు గల కల గల కలఉద్యమకారుల జెఏసీ లు ఉన్నాయి అందరిని కలుస్తాం..అన్ని యూనివర్సిటీల జేఎసి లు ఉన్నాయి వారిని కలుస్తాం.. సమావేశం ఏర్పాటు చేస్తాం..వారు మేము ఉద్యమంలో జీవితం యవ్వనం పోయిందని మమల్ని అందుకోవాలని కోరుతున్నారు..అద్దంకి దయాకర్,ఎమ్మెల్సీ×ప్రజా సంఘాలు ,విద్యార్థి సంఘాలు సబ్బండ వర్గాల తో సమావేశం అవుతాం..1969 ఉద్యమకారులను కూడా ఐడెంటిఫై చేయాలని చెప్పారు..చనిపోయిన వాళ్ళు ,గాయపడిన వారు ,కేసులు అయి జైలుకు పోయిన వారిని గుర్తించి గౌరవించుకోవాలని ముఖ్యమంత్రి ఆలోచన..మొదటి దశలో రాజకీయ పార్టీల నుండి తీసుకున్నాం.. అన్ని సంఘాల అభిప్రాయాలు తీసుకుంటామన్నారు.



# రేపటి నుంచి భూముల ధరల పెంపు: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, జూన్04: మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రర్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు.



రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తాను వచ్చాక ఏసీబీ ట్రాప్ అయిన ఫైల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్)లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

# అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం..

## ఒక్కసారిగా వ్యాపించిన మంటలు..

హైదరాబాద్, జూన్4 అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - ం1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడుతున్నాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అలర్ట్.. అమీర్‌పేటలో అగ్నిప్రమాదం.. ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, జూన్4 : అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - ం1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి అత్యవసర చర్యలు కొనసాగుతున్నాయి. ఈ అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట ? ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## సంపాదకీయం

**శుక్రవారం, జూన్ 05, 2026**

### నై.. నై.. రుతుపవనాలు

:దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. నైరుతి రుతుపవన కాలం.జూన్ 1వ తేదీ వచ్చింది అంటే చాలు, కేరళ తీరాన్ని వర్షాలు పలకరిస్తాయి. తద్వారా దేశవ్యాప్తంగా వ్యవసాయ పనులు ఊపందుకుంటాయని అందరూ ఆశిస్తారు. అయితే 2026 సీజన్‌లో నైరుతి రుతుపవనాల రాక కోసం కొంత జాప్యం చోటు చేసుకుంది. ముందుగా అంచనా వేసినట్టుగా జూన్ 1న ఇవి కేరళను తాకలేకపోయాయి. వాతావరణ పరిస్థితుల అనుకూలించకపోవడంతో ఇవి ప్రస్తుతం ఉన్నచోటే స్తబ్ధుగా నిలిచిపోయాయి. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకాల్సిన రుతుపవనాలు, ఈ సారి ఆ లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమయ్యాయి. ప్రస్తుతం ఇవి మార్గమధ్యలో నిలిచిపోయాయని భారత్ వాతావరణ శాఖ, ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ ధ్రువీకరించాయి. రుతుపవనాల ద్రోణి కదలికలు మందగించడమే దీనికి ప్రధాన కారణం. పూర్తిగా వ్యవసాయిక దేశం అయిన భారత్ లో వర్షాలే ఆధారం. ఎంతలా అంటే దేశ జీడీపీని ప్రభావితం చేసేటంతలా. గ్రామీణ ప్రాంతాలు దేశంలో నూటికి డెబ్బై శాతం ఉన్నాయి. దాంతో దేశ జాతీయ స్థూల ఆదాయం వృద్ధి చెందాలీ అంటే గ్రామీణ భారతం పచ్చగా ఉండాలి. అది ఎపుడు సాధ్యపడుతుంది అంటే భారీగా సమాయనుకూలంగా వానలు పడి పంటలు పండినపుడు. దేశంలో ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న మొదలవుతుంది. కానీ దేశంలో అగ్రికల్చర్ ఇయర్ మాత్రం జూన్ లో స్టార్ట్ అవుతుంది. దానికి కారణం నైరుతు రుతు పవనాల రాక. ఈ రుతు పవనాలు ఎంత తొందరగా వస్తే అంత సంబరంగా ఏరువాక స్టార్ట్ అవుతుంది. దాంతో రైతాంగం సైతం సంబరాలు చేసుకుంటుంది. కానీ ఈసారి పరిస్థితి చూస్తే నైరుతి నై నై అంటోంది: సకాలంలో నైరుతి రుతు పవనాలు దేశంలోకి ప్రవేశించడం అంటే మే నెలాఖరు అన్న మాట. ఈ మేరకు భారత వాతావరణ విభాగం ఐఎండీ అయితే మొదట చెప్పింది మే 26న నైరుతి దేశంలో ఎంట్రీ ఇస్తుందని. కానీ ఆ డేట్ తప్పింది. ఆ తరువాత మే 30, 31 తేదీలు అన్నా కూడా అదీ జరగలేదు. జూన్ 1 లేదా 3 అని చెప్పినా ఇపుడు ఆ డేటూ మారింది. లేటెస్ట్ డేట్ ఏంటి అంటే జూన్ 8 తరువాత అని అంటున్నారు. అయితే అది కూడా అంత కన్ ఫర్మ్ అవునా కాదా అన్నది ఒక పెద్ద డౌట్. మరో వైపు చూస్తే ఈసారి నైరుతి ఆగమనం లేట్ అయినా వానలు కూడా చాలా తక్కువ పడతాయని దానికి కారణం నైరుతి బలహీనంగా ఉందని. ఈ వార్తలు అయితే రైతాంగాన్ని కాదు దేశ ఆర్థిక నిపుణులను కూడా షాక్ కి గురి చేస్తున్నాయి. ఈసారి వానలు తక్కువ పడితే ఆ ప్రతికూల పరిస్థితి ఎలా ఉంటుంది అనే అంతా ఆలోచిస్తున్నారు. ఈసారి తేలిక పాటి వానలే పడతాయంటే వ్యవసాయం సంగతి ఏమిటి అన్నది కూడా మరో చింతగా మారుతోంది. భారత్ లో నైరుతి ఎంట్రీకి గేట్ వే కేరళం రాష్ట్రం. అక్కడ నుంచే మెల్లగా దేశంలోకి ప్రవేశించి మొత్తం దేశమంతా కొద్ది కాలంలోనే సర్దుకుని భారీ వానలు కురుస్తాయి. అలా వర్షాకాలం సీజన్ స్టార్ట్ అయి సెప్టెంబర్ నెలాఖరు వరకూ కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం కేరళంలో కొన్ని ప్రంతాలలో వర్షాలు పడుతున్నాయి కానీ నైరుతి ఆరంభ సూచిన అది కాదని ఐఎండీ చెబుతోంది. నైరుతి రాకను గుర్తించాలంటే కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. కేరళంలోని ఈ సీజన్ లో ఏకంగా అరవై శాతం పైగా వానలు పడితే నైరుతి ఎంటర్ అయినట్లుగా భావిస్తారు. అలాగే అరేబియా సముద్రం నుంచి పశ్చిమ దిశగా వీచే గాలులు ఆ నిర్దిష్ట వేగాన్ని అందుకోవాల్సి ఉంటుంది. ఆ మీదట ఆయా ప్రాంతమంతా తగినన్ని మేఘాలు విస్తరించి ఉండాలి. ఇవన్నీ నైరుతి రుతు పవనాల ఆగమాన్ని సూచిస్తాయి. ప్రస్తుతం అయితే కేరళం రాష్ట్రంలో కొన్ని చోట్ల వానలు పడుతున్నాయి. మేఘాలు విస్తరించి కూడా ఉన్నాయి. కానీ అసలైన ప్రమాణం అయిన అరేబియా సముద్రం నుంచి గాలులు వీయడం లేదని ఐఎండీ సైంటిస్టూ చెబుతున్నారు . ఈ మూడు ఒకేసారి కలసి ఉంటేనే నైరుతి పవనాల సీజన్ స్టార్ట్ అయినట్లు. అపుడు వర్షాకాలం వచ్చినట్లుగా చెబుతారు. ఇక ఈసారి పూర్తి స్థాయి వానలు కురిసే అవకాశాలు కూడా తక్కువ అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దానికి ఎల్ నినో ప్రభావం కారణం అని స్పష్టం చేస్తున్నారు. దాని వల్ల గత ఏడాది కంటే ఈసారి తక్కువ వానలు పడతాయని వాటితోనే సర్దుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. నైరుతి రుతు పవనాలు ఆలస్యమైనా లేదా ఎంట్రీ ఇచ్చినా బలహీనం కావడం వెనక ఎల్ నినో ప్రభావం గట్టిగా ఉంటుందని అంటున్నారు. ఈ విధంగా వర్షాభావ పరిస్థితులు కనుక ఉంటే ఇది దేశ ఆర్థిక వ్యవస్థ మీద కూడా పెను ప్రభావం చూపిస్తుందని అంటున్నారు.ఈ జాప్యాన్ని ప్రధాన కారణం ఏంటంటే... అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడిన పరిస్థితులే. ఈ రెండు కూడా రుతుపవనాల పురోగతికి ఆటంకం కలిగిస్తున్నాయి. పశ్చిమ దిశ నుంచి వీచే గాలులు రుతుపవనాలను కేరళ తీరం వైపు నెట్టడంలో సహాయపడాలి కానీ ప్రస్తుతం గాలి దిశ, వేగం ఇందుకు అనుకూలంగా లేవు. అయితే ఈ ఆలస్యానికి రాబోయే ఎల్‌నినో ప్రభావానికి ఎలాంటి సంబంధం లేదని స్కైమెట్ వాతావరణ, వాతావరణ మార్పుల విభాగంలో వైఎస్ ప్రెసిడెంట్ మహేష్ స్పష్టం చేశారు. రుతుపవనాలు కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థలపైనే ఆధారపడి కేవలం భారత్ పరిసరాల్లోని వాతావరణ వ్యవస్థపైనే ఆధారపడి ఉంటాయని ఆయన వివరించారు. కేరళలోని రుతుపవనాలు ప్రవేశించాయని చెప్పడానికి కొన్ని కచ్చితమైన నియమాలు ఉన్నాయి. అవి పూర్తి అయితేనే అధికారికంగా రుతుపవనాల రాకను ప్రకటిస్తారు. కేరళ, కర్ణాటక, లక్ష్యద్వీప్‌లోని సుమారు 60 శాతం వాతావరణ కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు కనీసం 2.5 మి.మి. వర్షపాతం నమోదు కావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పరిమితి ఇంకా నెరవేరలేదు. అందుకే అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతానికి రుతుపవనాలు ఆగిపోయినప్పటికీ , ఆశాజనకమైన వార్త కూడా ఉంది.

**- ఎడిటర్**

# మోడీ ది రికార్డ్....

న్యూఢిల్లీ, జూన్ 4, (న్యూస్ పల్స్)భారత రాజకీయాల్లో జూన్ 9, 2026 ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచిపోనుంది. ఆ రోజుతో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ చరిత్రలోనే అత్యధిక కాలం సేవలు అందించిన నేరుగా ప్రజలు ఎన్నుకున్న ప్రధానిగా సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న 12 ఏళ్ల 14 రోజుల రికార్డును ప్రధాని మోదీ అధిగమించనున్నారు. సాంకేతికంగా నెహ్రూ మొత్తం ప్రధానిగా ఉన్న కాలం ఎక్కువైనప్పటికీ.. ఆయన మొదటిసారి 1947లో మధ్యంతర ప్రభుత్వానికి ప్రధానిగా సెలెక్ట్ అయ్యారు తప్ప నేరుగా ప్రజల ద్వారా ఎన్నిక కాలేదు. కానీ, 2014 మే 26న మొదటిసారి నేరుగా ప్రజా బ్యాలెట్ ద్వారా ఎన్నికై ప్రధాని పీఠం అధిరోహించిన నరేంద్ర మోదీ, నాటి నుంచి నేటి వరకు నిరంతరాయంగా ప్రజామోదంతోనే ఈ రికార్డును సొంతం చేసుకుంటున్నారు. భారతదేశ మొదటి సార్వత్రిక ఎన్నికలు 1951-52లో జరిగాయి. అంతకంటే ముందు 1947 ఆగస్టు 15 నుండి జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటికీ.. అది రాజ్యాంగబద్ధంగా ప్రజల ఓట్లతో ఏర్పడిన ప్రభుత్వం కాదు. ఆ రకంగా చూస్తే నెహ్రూ నేరుగా ప్రజల ద్వారా ఎన్నుకున్న ప్రధానిగా కొనసాగిన నికర కాలం 12 ఏళ్ల 14 రోజులు మాత్రమే. నరేంద్ర మోదీ 2014 మే లో తొలిసారి, ఆ తర్వాత వరుస విజయాలతో నేరుగా ప్రజామోదం పొందుతూ ఈ రికార్డును బద్దలు కొడుతున్నారు. మోదీ సాధించిన ఈ ఘనతకు ఆయన నేతృత్వంలోని లీడర్‌షిప్, దేశవ్యాప్తంగా ఆయనకు ఉన్న తిరుగులేని




ప్రజాదరణే ప్రధాన కారణం.నరేంద్ర మోదీ హయాంలో భారతదేశం దశాబ్దాల నాటి సంకీర్ణ రాజకీయాల అస్థిరత నుంచి బయటపడి పటిష్టమైన రాజకీయ సుస్థిరత వైపు అడుగులు వేసింది. ఈ సుస్థిరత వల్లే జీఎస్టీ లాంటి క్లిష్టమైన పన్ను సంస్కరణలు, డిజిటల్ ఇండియా విప్లవం, బ్యాంకింగ్ రంగ ప్రక్షాళన వంటి సంచలన నిర్ణయాలు సాధ్యమయ్యాయి. జాతీయ భద్రత విషయంలో రాజీలేని వైఖరిని ప్రదర్శిస్తూ ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్ రద్దు వంటి చారిత్రాత్మక నిర్ణయాలతో దేశ అంతర్గత రాజకీయ స్వరూపాన్ని మోదీ మార్చివేశారు.మోదీని సుదీర్ఘకాలం ప్రధాని పీఠంపై కూర్చోబెట్టిన అసలైన బలం ఆయన ప్రవేశపెట్టిన అంత్యోదయ పథకాలు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా కోట్ల మంది పేదలకు పక్కా ఇళ్లు, ఉజ్వల పథకం ద్వారా ఉచిత

### 9వ తేదీతో 12 ఏళ్ల 15 రోజులు పూర్తి...

గ్యాస్ కనెక్షన్లు, జన్ ధన్ ఖాతాల ద్వారా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోకే నగదు బదిలీ వంటివి క్షేత్రస్థాయిలో విప్లవాత్మక మార్పులు తెచ్చాయి. అవినీతికి తావులేకుండా సాంకేతికతను వాడుకుంటూ ప్రభుత్వ సాయాన్ని నేరుగా పేదవాడి గడపకు చేర్చడం ద్వారా మోదీ మహిళలు, గ్రామీణ ఓటర్లలో ఒక బలమైన 'ప్రో-పూర్ ఇమేజ్‌ను సంపాదించుకున్నారు.గడిచిన పన్నెండేళ్లలో అంతర్జాతీయ దౌత్యరంగంలో భారత స్థానం అగ్రరాజ్యాల సరసనకు చేరింది. మోదీ నాయకత్వంలో భారత్ జి-20 సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి గ్లోబల్ సౌత్ వాయిస్‌గా అవతరించింది. రష్యా-ఉక్రెయిన్ సంక్షోభం, మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల సమయంలోనూ భారత్ అనుసరించిన తటస్థ, వ్యూహాత్మక దౌత్యనీతి ప్రపంచ దేశాలను ఆకట్టుకుంది. నేడు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన భారత్, త్వరలోనే మూడో స్థానానికి చేరుకోవడానికి సిద్ధంగా ఉంది.దేశీయ రక్షణ, ఉత్పాదక రంగాలలో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా మేక్ ఇన్ ఇండియా , ఆత్మనిర్భర్ భారత్ పిలుపునిచ్చారు. ఫలితంగా నేడు భారత్ మొబైల్ తయారీలో ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరింది. రక్షణ ఎగుమతుల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. జాతీయ రహదారుల నిర్మాణం, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, విమానాశ్రయాల ఆధునీకరణ ద్వారా దేశ మౌలిక సదుపాయాల రంగాన్ని ఊహించని వేగంతో పరుగులు పెట్టించారు.నరేంద్ర మోదీ సృష్టించబోయే ఈ చారిత్రాత్మక రికార్డు కేవలం ఒక వ్యక్తిగత మైలురాయి కాదు. ఇది భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ స్థిరత్వానికి, ప్రజలు ఒక బలమైన నాయకత్వంపై ఉంచిన నమ్మకానికి నిదర్శనం. నెహ్రూ రికార్డును దాటుకుని ముందుకు సాగుతున్న మోదీ నవభారత నిర్మాణంలో తన ముద్రను మరింత బలంగా వేస్తున్నారు.

# విజయ్ వర్సెస్ అన్నామలై...



చెన్నై, జూన్ 4, (న్యూస్ పల్స్)తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. మొన్నటి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితా?లే ఇందుకు కారణమని చెప్పాలి. ఈ ఎన్నికల్లో కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ స్థాపించిన తమిళ వెట్రిగ కజగం (టీవీకే) రెండు పెద్ద పార్టీలను చిత్తు చేసి అధికార పార్టీగా అవతరించిన తీరు ఈ ఆసక్తిని మరింతగా పెంచింది. ఈ ఆసక్తి ఎక్కడిదాకా వెళ్లిందంటే? తమిళనాడు అసెంబ్లీకి 2031లో జరిగే ఎన్నికల సమీకరణాల వరకూ వెళ్లిపోయింది. 2031లో జరిగే తమిళ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ విజయ్ వర్సెస్ అన్నామలై అంటూ ఆసక్తికర విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ఈ విశ్లేషణలు ఎంతమేర కార్యరూపం దాలుస్తాయన్న దానిపైనా ఇప్పుడు ఆసక్తికర చర్చలు జరుగుతున్నాయి. తమిళనాడు నూతన సీఎం విజయ్ ఎన్నికలకు రెండేళ్ల ముందుగానే రాజకీయ పార్టీని ప్రకటించి? రెండేళ్ల పాటు ప్రజల్లో తిరిగారు. అప్పటికే తనకున్న స్టార్ డమ్ ను, ఫ్యాన్ ఫాలోయింగ్ ను చక్కగా వినియోగించుకున్న విజయ్? ఎన్నికల్లో విజయం సాధించారు. ఈ విజయానికి దివంగత నేతలు కరుణానిధి, జయలలితల మరణాలతో ఏర్పడిన రాజకీయ శూన్యతను సద్వినియోగం చేసుకోవడంలో విజయ్ సఫలమయ్యారు. 2031 నాటికి విజయ్ పార్టీ ఓ ప్రధాన పోటీదారుగా అయితే ఉంటుందని పక్కాగా చెప్పవచ్చు.ఇక బీజేపీ నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధమైపోయిన అన్నామలై విషయానికి వస్తే.. అసలు ఆయన రాజకీయ ప్రయాణం ఎలా అన్న దానిపై ఇప్పటిదాకా స్పష్టతే లేదని చెప్పాలి. ఓ ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న అన్నామలై? తన సివిల్ సర్వెంట్ పదవికి రాజీనామా చేసి మరీ?రాజకీయాల్లోకి వచ్చారు. వచ్చీరాగానే బీజేపీ బాటలో నడిచిన ఆయన? బీజేపీ తమిళనాడు అధ్యక్షుడి హోదాలో పలు కీలక కార్యక్రమాలకు దిగారు. బహిరంగంగా తనను తాను కొరడాతో కొట్టుకుని నిరసన వ్యక్తం చేసిన అన్నామలై దేశవ్యాప్తంగా అయితే గుర్తింపును దక్కించుకున్నారు. అయితే ఆయన భవిష్యత్తు రాజకీయ చిత్రం ఏమిటన్నది ఇప్పటికీ తెలియదనే చెప్పాలి.అన్నామలై బీజేపీని వీడే దిశగా సాగుతూ ఉంటే? ఆయనను పార్టీలోనే నిలుపుకునే దిశగా కమలం పార్టీ యత్నిస్తోంది. అయినా బీజేపీని వీడినా అన్నామలై? విజయ్ స్థాయిలో ప్రజాదరణను చూరగొంటారన్న గ్యారెంటీ అయితే లేదు. ఎందుకంటే? ఇప్పటికే ఓ రాజకీయ పార్టీలో పనిచేసిన ఆయన ఆ పార్టీని వీడి బయటకు వచ్చేందుకు యత్నిస్తూ? రాజకీలపై తనకు ఇంకా స్పష్టత రాలేదన్న విషయాన్ని తనకు తానుగానే బయటపెట్టుకున్నారు. విజయ్ కి కోట్లాది మంది ఫ్యాన్స్ ఓట్లు వేసి, వెయించి ఆయనకు గెలుపును అందిస్తే? ఆ స్థాయిలో అన్నామలైకి ఓట్లు వేసి, వేయించే వారు ఎవరన్నది ప్రశ్నార్థకం. వెరసి విజయ్ తో అన్నామలై పోలిక అసలు కుదరదని చెప్పాలి. అంతేకాకుండా? విజయ్ కి ఆయన ప్రధాన ప్రత్యర్థి అవుతారన్నది దాదాపుగా సాధ్యం కాదని చెప్పాలి.2024 లోక్ సభ ఎన్నికల సమయంలో అన్నామలై మాట్లాడుతూ.. 2026లో తమిళనాడు ఏ ఒక్క పార్టీ సొంతంగా అధికారంలోకి రాలేదని అంచనా వేశారు. ఆయన అంచనాలకు దగ్గరగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆప్షన్-ఏ కింద తమిళనాడులో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని అంచనా వేసిన అన్నామలై.. ఆప్షన్-బి కింద బీజేపీ గనుక వచ్చే రెండేళ్లపాటు శ్రమించి క్షేత్రస్థాయిలో నాయకులను తీర్చిదిద్దితే.. 500 రోజుల ముందు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను ప్రకటిస్తే.. 2026లో ప్రజలు తమవైపు మొగ్గు చూపుతారని ఆయన అంచనా వేశారు.బీజేపీ పెద్ద రిస్క్ తీసుకొని.. ఎన్నికల నోటిఫికేషన్ అమల్లోకి రావడానికి 500 రోజుల ముందు అభ్యర్థులను ప్రకటిస్తే.. తమిళనాడులో బీజేపీకి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందని అన్నామలై 2024లోనే వ్యాఖ్యానించారు.అన్నామలై చెప్పినట్లు 2026 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా లేదా.. 2024 ఎన్నికల తరహాలోనే చిన్న పార్టీలతో కలిసి పోటీ చేసి 5-6 సీట్లు గెలుచుకున్నా సరే.. ఇప్పుడు తమిళనాడు ముఖచిత్రం మరోలా ఉండేదని చెప్పొచ్చు. ఒకవేళ ఒక్క సీటు గెలవలేకపోయినా సరే, 10 శాతానికి అటు ఇటుగా ఓట్లు సాధిస్తే మరుసటి ఎన్నికల నాటికి బీజేపీ పరిస్థితి ఆశాజనకంగా ఉండేది. అయితే బీజేపీ అధినాయకత్వం ఆయన మాటలను పరిగణనలోకి తీసుకోలేదు. అన్నాడీఎంకేతో పొత్తుకే ప్రాధాన్యం ఇచ్చింది. ఈపీఎస్ డిమాండ్‌తో అన్నామలైను పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించింది. దీంతో 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాక.. పళనిస్వామి పేరు కూడా ఎత్తకుండా అన్నామలై ట్వీట్ చేశారు. జాతీయ పార్టీ అయిన బీజేపీకి కొన్ని సమస్యలు కూడా ఉంటాయని అన్నామలైకు తెలుసు. తమిళనాడులో ద్రవిడ వాదంతోపాటు బీజేపీ పట్ల వ్యతిరేకత కూడా ఎక్కువే. అందుకే బీజేపీ నాయకుడిగా జనంలోకి వెళ్లడం కంటే.. సొంత పార్టీ పెట్టుకుని జాతీయవాద దృష్టి, లౌకిక భావనలతో ముందుకెళ్తే తనకు సొంతంగానే ఎదిగే అవకాశం ఉందని అన్నామలై భావించి ఉండొచ్చు. 41 ఏళ్ల తాను మరో పదేళ్లు కష్టపడితే పార్టీని అధికారంలోకి తీసుకురావడం కష్టం కాదనే అంచనాతోనే ఆయన సొంత పార్టీవైపు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే డీఎంకేను దెబ్బతీసి విజయ్ నాయకత్వంలోని టీవీకే అధికారంలోకి రాగా.. మూడో స్థానానికి పరిమితమైన అన్నాడీఎంకేను అన్నామలై దెబ్బకొట్టే అవకాశం ఉంది.

# ఖజానా ఖాళీ...

హైదరాబాద్, జూన్ 4(న్యూస్ పల్స్) కాంగ్రెస్ సర్కార్.. తెలంగాణ బండిని నడపలేక దిక్కులు చూస్తోందా? ఏం చేయాలో తోచక ప్రభుత్వ పెద్దలు తలలు పట్టుకుంటున్నారా? తెలంగాణ సర్కార్‌కు ఆర్థిక కష్టాలు కొత్త తలనొప్పులు తెస్తున్నాయా? నిధుల లేమితో అభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఏకంగా ఆర్థిక శాఖ మంత్రే ఎమ్మెల్యేలతో ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆర్థిక పరిపుష్టికి ఇంకా సమయం పడుతుందని..అప్పటిదాకా కొత్తగా నిధులు ఇవ్వలేమంటూ ఏకంగా ఆర్థిక మంత్రే చేతులెత్తేయడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఇలా అయితే ఇక ప్రజల్లోకి వెళ్లేది ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారట అధికార పార్టీ ఎమ్మెల్యేలు.తెలంగాణ సర్కార్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. అవును. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఇచ్చిన రిపోర్ట్ ఇదే స్పష్టం చేస్తోంది. లోటు బడ్జెట్‌తో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నట్లు కాగ్ స్పష్టం చేసింది. హామీల అమలుకు ఆర్థిక స్థితి అడ్డంకిగా మారుతోంది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇస్తే..వాటిని అమలు చేయడం ఇప్పుడు సర్కార్‌కు సవాల్‌గా మారింది. బడ్జెట్ అంచనాలకు..వాస్తవాలకు పొంతన లేని పరిస్థితి. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వానికి 100 రూపాయలు ఆదాయం వస్తే దాదాపు 108 రూపాయలు ఖర్చు అవుతుంది. దీని కోసం ప్రతినెల అప్పులు చేయాల్సి వస్తోంది. దీంతో కేవలం రెండున్నర ఏళ్లలోనే 4.14 లక్షల కోట్ల అప్పులను తెచ్చింది సర్కార్. గతంలో ఉన్న అప్పులకు..అసలు, వడ్డీలు కట్టలేక నడ్డి విరుగుతుంటే..మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్లుగా కొత్తగా అవుతున్న లక్షల కోట్ల అప్పులు రేవంత్ ప్రభుత్వానికి గుదిబండగా మారాయి.అటు సంక్షేమాన్ని.. ఇటు అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరాటపడుతుంటే..రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగా మారుతోంది. దీంతో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు?కొత్త కొత్త పనులు, ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తూ సర్కార్

### ప్రతి నెలా దాదాపు రూ.18 వేల నుంచి 20 వేల కోట్ల ఖర్చు..

ముందుకెళ్తోంది. వాస్తవంగా ప్రతి నెల జీతాలు, పెన్షన్లు, అసలు, వడ్డీల చెల్లింపు, ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, ఇతర చెల్లింపులు అన్ని దాదాపు 18 వేల నుంచి 20 వేల కోట్ల వరకు ఖర్చవుతుంది. కానీ వాస్తవ రాబడి మాత్రం కేవలం 16 నుంచి 18 వేల కోట్లలోపే ఉంటుంది. అంటే దాదాపు ప్రతి నెల సగటున రూ.2,250 కోట్ల లోటు సర్కార్ కు సవాల్ గా మారుతోంది. ప్రభుత్వం శక్తికి మించి కార్యక్రమాల అమలుకు, కొత్త అభివృద్ధి పనులను చేపట్టడం.. ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి నిచ్చెన వేసిందన్నట్లుగా తయారైంది పరిస్థితి.ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో వివిధ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై భట్టి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలలకో, సంవత్సరానికో పరిస్థితి కుదుట పడుతుందని భట్టి తేల్చి చెప్పడంతో ఎమ్మెల్యేల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ప్రభుత్వం ఎప్పుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతుందో? ఖజానా ఎప్పుడు కళకళలాడుతుందో? అప్పులు తీసుకునే అవసరం తగ్గుతుందో లేదో అనేది చూడాలి.

### మట్టి తవ్వకాలలో కలెక్టర్ ఆదేశాలు గాలికి..

కృష్ణాజిల్లా,పామర్రు మండలం రిమ్మనపూడి గ్రామంలో చెరువు తవ్వకాలు పగలు రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ పర్మిషన్ తీసుకుని తవ్వుతున్నప్పటికీ ఐదు నుంచి 12 అడుగుల లోతు తవ్వుతున్నారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం గ్రామ అభివృద్ధికి మాత్రమే మట్టి తోలకలు జరగాలి. కానీ గ్రామ అభివృద్ధి శూన్యం. మట్టి అమ్ముకుని డబ్బు సొమ్ము చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

# జూన్ 15 డెడ్ లైన్...

హైదరాబాద్, జూన్ 4(న్యూస్ పల్స్)తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూటు మార్చారు. ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బీజేపీ పట్ల మెతక వైఖరిని రేవంత్ అవలంబిస్తున్నారన్న అభిప్రాయం ఉండేది. కానీ రానున్న ఏ ఎన్నికల్లోనైనా బీజేపీ తనకు ప్రధాన ప్రత్యర్థిగా భావించిన రేవంత్ రెడ్డి ఆ పార్టీ విషయంలో దూకుడుగా వెళ్లాలని నిర్ణయించినట్లు కనపడుతుంది. రాష్ట్ర నేతలనే తన టార్గెట్ చేసినా నేరుగా కేంద్ర ప్రభుత్వాన్ని తాకేలా రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఒకింత రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించడం కూడా హాట్ టాపిక్ గా మారిందని రాజకీయ విశ్లేషకులు సయితం అభిప్రాయపడుతున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ నేతలకు హెచ్చరిక జారీ చేశారు. పోలవరం కోసం ఏడు తెలంగాణ మండలాలను ఆంధ్రప్రదేశ్ లో కలిపారని, తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర భూములను రెండు వేల ఎకరాలు ఇవ్వలేరా అంటూ మహారాష్ట్రలో ఉన్న బీజేపీ సర్కార్ ను రేవంత్ రెడ్డి నిలదీశారు. ఎన్ని లేఖలు రాసినా మహారాష్ట్ర సీఎం స్పందించడం లేదంటూ తప్పంతా బీజేపీదేనంటూ ఆ పార్టీపై విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం రాష్ట్రం నుంచి డెబ్బయి ఐదు లక్షల క్వింటాళ్ల వడ్లు కొంటున్నామని, ఆ ధాన్యాన్ని కేంద్రం తీసుకోవాలని కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరొక డిమాండ్ కేంద్ర ప్రభుత్వానికి విధించారు.అంతే కాదు సత్రంలో పెట్టే భోజనానికి..నెల్లూరు పెద్దారెడ్డి రికమండేషన్ అవసరం లేదన్నారు. రాష్ట్రంకొనే పంటను కేంద్రం తీసుకునేలా..కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పంటను కేంద్రం తీసుకోకపోతే జూన్ 15 తర్వాత బీజేపీ ఆఫీసు దగ్గరే తేల్చుకుంటామని రేవంత్ హెచ్చరించారు. అక్కడికే ధాన్యాన్ని తీసుకు వచ్చి పారబోస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. అంతే కాదు కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకోకపోతే రాష్ట్రంలో తిరగలేని పరిస్థితి వస్తుందన్నారు. వడ్లు, జొన్నలు, మొక్కజొన్న కొనాల్సిందనని, జూన్ 15 తర్వాత కార్యాచరణ ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించడంతో రేవంత్ రూటు మార్చినట్లు కనపడుతుంది.


# తెలంగాణ ఎవరు జాగీర్

హైదరాబాద్, జూన్ 4(న్యూస్ పల్స్)తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరం పూర్తయింది. అయినా ఇప్పటికీ తెలంగాణ అంశం, ఉద్యమం, సెంటిమెంట్ ప్రజల్లో రగులుతూనే ఉంది. రాజకీయ నేతలు దానిని రగిలిస్తూనే ఉన్నారు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య జరుగుతున్న మాటల యుద్ధంతో తెలంగాణ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. రాష్ట్రం 12 ఏళ్లు గడిచినా, ఆ అస్తిత్వం ఇప్పటికీ రాజకీయ యుద్ధభూమిగా మారుతోంది. ఇటీవలి పవన్ కల్యాణ్?పొన్నం ప్రభాకర్ వాగ్వాదం ఈ వాస్తవాన్ని మరోసారి బయటపెట్టింది. తెలంగాణ ఏర్పాటు దినోత్సవం సమయంలో హైదరాబాద్‌లో 'నవనిర్మాణ సభ' నిర్వహించాలని పవన్ కల్యాణ్ ప్రకటించగా, మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. "తెలంగాణ మీ అయ్య జాగీరా?" అని పవన్ ప్రశ్నించిన దానికి "అవును, మా అయ్య జాగీరే" అన్న తీరుగా వచ్చిన సమాధానాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఉద్యమం నుంచి జాగీరు మనస్తత్వం వరకుదశాబ్దాల పోరాటం, విద్యార్థుల త్యాగాలు, యువకుల ఆత్మాహుతులు, లక్షలాది మంది ప్రజల ఉద్యమ ఉత్సాహం.. ఇవన్నీ తెలంగాణను కేవలం ఒక భౌగోళిక ప్రాంతంగా కాకుండా ఆత్మగౌరవ చిహ్నంగా నిలిపాయి. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు "మా రాష్ట్రం, మా సంపద, మా నిర్ణయాలు" అన్న నినాదం ప్రజల హృదయాల్లో గాఢంగా నాటుకుంది. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొంతమంది నాయకులు ఆ స్ఫూర్తిని తమ కుటుంబం, తమ పార్టీ లేదా తమ ప్రాంతీయ ఆధిపత్యానికి పరిమితం చేస్తున్నారు.

"ఇది మా అయ్య జాగీరు" అన్న మాటలు ఆ ఫ్యూడల్ భావనను స్పష్టంగా బయటపెడుతున్నాయి. ఉద్యమ కాలంలో అణచివేతను ఎదిరించిన వారే ఇప్పుడు తమను తాము "యజమానులు"గా చూసుకోవడం బాధాకరం.తెలంగాణపై మూడు ముఖ్యమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల సొత్తా? పార్టీలదా..?, బయటివారిదా? అంటే ఇది ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు, ఎవరి కుటుంబ వ్యాపారం కాదు.ఏదైనా ఒక రాజకీయ పార్టీ లేదా కుటుంబం యాజమాన్యంలో ఉందా?ఎవరి ఆధిపత్యంలోనూ ఉండకూడదు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, రాష్ట్రం ప్రజల సార్వభౌమత్వానికి లోబడి ఉండాలి.రాజకీయం చేయడం తప్పా? భారత రాజ్యాంగం ప్రకారం ఏ భారతీయ పౌరుడికైనా దేశంలో ఎక్కడైనా రాజకీయ కార్యకలాపాలు చేసే స్వేచ్ఛ ఉంది. కానీ ఆ కార్యకలాపాలు స్థానిక భావాలను గౌరవించి, ఉద్యమ త్యాగాలను అవమానించకుండా జరగాలి. "వలసదారులు" అన్న మాటను రాజకీయ ఆయుధంగా ఉపయోగించడం కూడా ప్రమాదకరం. పవన్ కల్యాణ్ గతంలో తెలంగాణ ఏర్పాటుపై చేసిన కొన్ని వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల భావాలను గాయపరిచాయన్న విమర్శలు ఉన్నాయి. అదే సమయంలో, స్థానిక నాయకులు "ఇది మా జాగీరు" అని చెప్పడం ఆ గాయాలను మరింత లోతు చేస్తోంది. రెండు వైపులా ఉన్న ఈ ధోరణి తెలుగు రాష్ట్రాల మధ్య సహజీవనానికి మంచిది కాదు.తెలంగాణ ఉద్యమం అణచివేతకు వ్యతిరేకంగా పుట్టింది. ఆ ఉద్యమ స్ఫూర్తి ఇప్పుడు కొందరి రాజకీయ ఆధిపత్యం మరియు వ్యక్తిగత స్వార్థాలకు బలి అవుతోంది. "జాగీరు" మనస్తత్వం రాజకీయాలను కుటుంబ ఆస్తిగా మార్చేస్తుంది. ఇది దీర్ఘకాలికంగా ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుంది. నిజమైన అభివృద్ధి కావాలంటే తెలంగాణను ఎవరి యాజమాన్యంగా కాకుండా, అందరి హక్కుగా చూడాలి. నాయకులు యజమానులుగా కాకుండా సేవకులుగా పని చేయాలి. బయటి నాయకులైనా, స్థానికులైనా వారి పనితనం, వారి విధానాలు, వారి నిబద్ధత ఆధారంగానే ప్రజలు నిర్ణయం తీసుకోవాలి.తెలంగాణ ప్రజలు దశాబ్దాల త్యాగాలతో సాధించిన ఆత్మగౌరవం ఇప్పుడు రాజకీయ లాభాల కోసం బలిపశువు కాకూడదు. ఈ "జాగీరు" వివాదం ఒక సంకేతం మాత్రమే. ఇది రాజకీయ వ్యవస్థలో ఇంకా ఉన్న ఫ్యూడల్ మనస్తత్వానికి అద్దం పడుతోంది తెలంగాణ ముమ్మాటికి ఇక్కడి ప్రజలదే. మిగతా అన్నీ కేవలం రాజకీయ భ్రమలు మాత్రమే

## 2027లో కేటీఆర్ పాదయాత్ర

హైదరాబాద్, జూన్ 4న్యూస్ పల్స్) ఏ పార్టీ నేత పాద యాత్ర చేసే ఎన్నికల్లో ఆ పార్టీ గెలవడం ఖాయం. ఈ సంప్రదాయం తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ పాదయాత్రల సంస్కృతికి శ్రీకారం చుట్టారు. పదేళ్ల టీడీపీని గద్దెలోకి దించేందుకు ఆయన పాదయాత్ర చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత వైఎస్సార్ తనయుడు జనగ్ కూడా పాదయాత్ర చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2019లో అధికారంలోకి వచ్చారు. ఇక 2023లో టీడీపీ నేత లోకేశ్ పాదయాత్ర చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2022లో తెలంగాణలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇదే సెంటిమెంటు కొనసాగించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రను ఎంచుకున్నారు. 2027లో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టనున్నట్లు తాజాగా కేటీఆర్ ప్రకటించారు. గతంలో కూడా చెప్పాడు. ఇది తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చనీయాంశమైంది. తాజాగా "ఈలోపు ఫిట్ అవుతాను" అని చెప్పుతూ, పాదయాత్ర మార్గం పార్టీ చర్చల అనంతరం నిర్ణయిస్తామని తెలిపారు. ఇది సాధారణ ప్రకటన కాదు. ఇది బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారం లక్ష్యంగా ఈ పాదయాత్రం ఉంటుందని పేర్కొంటున్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బీఆర్ఎస్‌కు ప్రజల మధ్య ఒక దూరం ఏర్పడిందని. ఇది చాలా ముఖ్యమైన అంగీకారం. ఎందుకంటే, ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు పాలనా యాంత్రికత, అధికార దూరం వల్ల గ్రామీణ?ప్రజా స్థాయి సంబంధాలు బలహీనపడతాయి. బీఆర్ఎస్ ఈ వాస్తవాన్ని అంగీకరించి, పాదయాత్ర ద్వారా ఆ అంతరాన్ని తగ్గించాలని నిర్ణయించుకోవడం రాజకీయంగా బాధ్యతావంతమైన వైఖరి.ఏ పార్టీ నేత పాద యాత్ర చేసే ఎన్నికల్లో ఆ పార్టీ గెలవడం ఖాయం. ఈ సంప్రదాయం తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ పాదయాత్రల సంస్కృతికి శ్రీకారం చుట్టారు. పదేళ్ల టీడీపీని గద్దెలోకి దించేందుకు ఆయన పాదయాత్ర చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత వైఎస్సార్ తనయుడు జనగ్ కూడా పాదయాత్ర చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2019లో అధికారంలోకి వచ్చారు. ఇక 2023లో టీడీపీ నేత లోకేశ్ పాదయాత్ర చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2022లో తెలంగాణలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇదే సెంటిమెంటు కొనసాగించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాదయాత్రను ఎంచుకున్నారు.



## ఏఐ హబ్ గా మారుతున్న హైదరాబాద్

హైదరాబాద్, జూన్ 4(న్యూస్ పల్స్)గ్లోబల్ ఐటీ రంగంలో తనదైన ముద్ర వేసిన హైదరాబాద్ నగరం.. ఇప్పుడు సరికొత్త సాంకేతిక విప్లవానికి వేదికగా మారుతోంది. సాధారణ ఐటీ సేవల దశ నుంచి ఒక అడుగు ముందుకేసి.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , హైపర్‌స్కేల్ డేటా సెంటర్ల హబ్‌గా అవతరిస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెంట్ 'నైట్ ఫ్రాంక్ ఇండియా' విడుదల చేసిన ఇండియా డేటా సెంటర్ మార్కెట్ అప్‌డేట్ 2025 నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. గత మూడేళ్ల కాలంలోనే హైదరాబాద్ తన లైవ్ ఐటీ సామర్థ్యాన్ని రెట్టింపు కంటే ఎక్కువ స్థాయికి పెంచుకోవడం విశేషం.నివేదిక వివరాల ప్రకారం.. 2022 సంవత్సరంలో కేవలం 60.9 మెగావాట్లుగా ఉన్న హైదరాబాద్ లైవ్ ఐటీ సామర్థ్యం.. 2025 చివరి నాటికి ఏకంగా 151.4 మెగావాట్లకు చేరుకుంది. రాబోయే పదేళ్ల కాలంలో హైదరాబాద్‌లో దాదాపు 1.9 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన డేటా సెంటర్ల అభివృద్ధి పనులు ప్రాథమిక దశలో ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద హైపర్‌స్కేల్ హబ్‌గా ఉన్న ముంబై మొత్తం సామర్థ్యం 3.9 గిగావాట్లు కాగా.. తర్వాతి స్థానంలో హైదరాబాద్ నిలిచి తన సత్తా చాటింది.హైదరాబాద్ గ్లోబల్ ఏఐ డేటా సెంటర్ హబ్‌గా ఎదగడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చొరవలు ప్రధాన కారణమని నివేదిక పేర్కొంది. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో పాటు హై-డెన్సిటీ గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు, భారీ స్థాయి శిక్షణ కంప్యూట్, లిక్విడ్ కూలింగ్ టెక్నాలజీల ఏర్పాటుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యేక ప్రోత్సాహకాలు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని చెప్పింది.హైదరాబాద్‌లో డేటా సెంటర్ల డిమాండ్ కూడా క్రమంగా మారుతోందని నివేదికలో వెల్లడైంది. 2024లో నగరం 19.2 మెగావాట్ల డేటా స్పేస్ వినియోగాన్ని నమోదు చేసింది. 2025లో ఈ డిమాండ్ కొంత మేర స్థిరంగా ఉన్నప్పటికీ.. మార్కెట్‌లో ఖాళీల శాతం సగటున 23 శాతంగా నమోదైంది. అంటే రాబోయే రోజుల్లో ఏఐ టెక్నాలజీ ఆధారంగా రానున్న భారీ డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా మార్కెట్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉందని నివేదిక విశ్లేషించింది. ఈ దూకుడు చూస్తుంటే భవిష్యత్తులో గ్లోబల్ ఏఐ మ్యాప్‌లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఫ్యూచర్ సిటీ ఎకరానికి 1.24 కోట్ల పరిహారం

హైదరాబాద్, జూన్ 4(న్యూస్ పల్స్)తెలంగాణలోని అర్బన్ రీజియన్లలో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రభుత్వం రికార్డు స్థాయి పరిహారం చెల్లిస్తోంది. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమీపంలోని కొంగర ఖుర్ద్, కొంగర కలాన్ గ్రామాల్లో ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే కోసం ఎకరాకు గరిష్టంగా రూ.1.24 కోట్ల భారీ పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించింది. రూ.4,600 కోట్లతో ప్రతిపాదించిన 300 అడుగుల ఈ రహదారి కోసం రెండు దశల్లో మొత్తం 1,500 ఎకరాలను సేకరిస్తున్నారు.తెలంగాణ రాజధాని పరిసర ప్రాంతాలలో, ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇటీవల రాయదుర్గం ఏరియాలో ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరాకు రికార్డు స్థాయిలో రూ.204 కోట్లు పలికింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల కోసం రైతుల నుంచి భూములను సేకరించడం పెద్ద సవాలుగా మారింది. దీంతో భూసేకరణ ప్రక్రియ సజావుగా.. ఎలాంటి వివాదాలు లేకుండా సాగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రికార్డు స్థాయి పరిహారం చెల్లించాల్సి వస్తోంది. తాజాగా ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీకి అనుసంధానంగా ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన కొందరు రైతులకు ప్రభుత్వం రికార్డు స్థాయిలో పరిహారం అందించింది. ఎకరాకు ఏకంగా రూ.1.24 కోట్ల చొప్పున భారీ పరిహారాన్ని అందజేసింది.రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు ఆనుకుని, ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కొంగర కలాన్, కొంగర ఖుర్ద్ గ్రామాల్లో ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధర ఎకరాకు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కోసం 15 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. మార్కెట్ రేట్లు భారీగా ఉండటంతో జిల్లా యంత్రాంగం రైతులతో పలుమార్లు చర్చలు జరిపింది. చివరకు కుదిరిన ఒప్పందం ప్రకారం ఎకరాకు రూ.1.24 కోట్ల రికార్డు స్థాయి పరిహారాన్ని చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్‌వే వెళ్లే మార్గంలోని ఇతర లొకేషన్లను బట్టి రైతులకు ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.98 లక్షల వరకు అందజేశారు. మారుమూల ప్రాంతాల్లో మాత్రం ఎకరాకు రూ.15 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు.కాగా, రావిర్యాల్ ఓఆర్ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట్ మీదుగా ఆమన్‌గల్ వరకు రెండు విడతల్లో దాదాపు రూ.4600 కోట్ల అంచనా వ్యయంతో 300 అడుగుల వెడల్పైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 1500 ఎకరాల భూమి అవసరం కానుంది. ఫేజ్-1 కింద 447 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తయింది. ఫేజ్-2 కింద మరో 558 ఎకరాల భూసేకరణ ప్రక్రియ ప్రస్తుతం వేగంగా సాగుతోంది. ఈ భారీ ఎక్స్‌ప్రెస్‌వే రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూర్, కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల గుండా వెళ్తుంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన మొత్తం 1500 ఎకరాల భూమిలో దాదాపు 300 ఎకరాలు అటవీ భూమి కాగా.. మరో 200 ఎకరాలు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఫ్యూచర్ సిటీకి రవాణా కనెక్టివిటీ మరింత అద్భుతంగా మారనుంది.

## తెరపైకి నీటి కుంటలు

నిజామాబాద్, జూన్ 4న్యూస్ పల్స్)12 లక్షల లీటర్ల నిల్వ.. 20 మీటర్ల వెడల్పు.. 20 మీటర్ల పొడవు.. 3 మీటర్ల లోతుతో నీటి కుంట నిర్మించుకుంటే సుమారు 12 లక్షల లీటర్ల నీరు నిల్వ చేసుకోవచ్చు. ఇందుకు ఉద్యానశాఖ 50 శాతం రాయితీ ఇస్తోంది. కష్టకాలంలో బిందు సేద్యం ద్వారా పంటలకు నీటి తడులు అందించొచ్చు. తద్వారా దిగుబడులు పెంచుకోవచ్చు. బోరు బావులపై భారాన్ని తగ్గించొచ్చు. సిల్పాలిన్ షీట్తో కుంటకు లైనింగ్ చేసుకోవడం ద్వారా నీటి లీకేజీని అరికట్ ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా చేసుకోవచ్చు.ఖరీఫ్ పంటల సాగుకు ఇంకా సమయం ఉన్నందున రైతులు వెంటనే నీటి కుంటలు తవ్వుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాధారంగా పంటలు పండించే మెట్ట ప్రాంతాల్లో ఇవి కీలకంగా ఉంటాయని చెబుతున్నారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, మిరప, పసుపు ఇలా... దీర్ఘకాలం సాగులో ఉండే ఈ పంటలకు నీటి తడులు తరచూ అందించాల్సి ఉంటుంది. చాలాచోట్ల నీటి వనరులు అందుబాటులో లేని కారణంగా కొంతమంది రైతులు ఉద్యాన పంటల సాగులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటివారికి తక్షణ ఉపాయంగా నీటి కుంటలను సూచిస్తోంది ఉద్యానశాఖ.ఎందుకంటే... నిర్దేశిత పరిమాణంలో నీటి కుంటలను తవ్వుకోవడం వల్ల సాగునీటి ఇబ్బందులుండవు. ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉన్నందున రైతులు దృష్టి సారించొచ్చు. కుంటల పరిమాణం ఆధారంగా రాయితీలు వినియోగించుకోవచ్చు. మిర్చి సాగులో కీలక దశలో ఒక్క తడి అందించకపోయినా దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు కిలోమీటర్ల దూరం నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకున్న ఘటనలెన్నో ఉన్నాయి. బోధన్ మండలంలోని పెగడపల్లి, భూలక్ష్మి క్యాంప్, బర్దిపూర్, సాలంపాడు సాలుర మండలాల్లో ఈ గుంటలో నిర్మిస్తున్నారు.ప్రాంతాల్లో అప్పటికప్పుడు నీటి కుంటలు తవ్విన పరిస్థితులూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేసవిలోనే నీటి కుంటలు తవ్వుకుంటే కాస్త వర్షం కురిసినా.. నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకోవచ్చు. వర్షాలు కాస్త ఆలస్యమైనా.. కాలువలకు నీటి విడుదలలో జాప్యం జరిగినా.. ఇవి ఉపయోగపడతాయి. పంట కుంటల వల్ల పొలంలో 5 సెంట్ల వరకు సాగుకు ఉపయోగపడదన్న అపోహాలో కొంతమంది రైతులున్నారు. వాటి ఆవశ్యకతను గుర్తించాలని జలవనరుల నిపుణులు సూచిస్తున్నారు.

## క్రీడలను ప్రోత్సహిద్దాం.. మంచి విద్యార్థులను తయారు చేద్దాం

### ఎంపి ఈటల రాజేందర్


రంగారెడ్డి,మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్ లో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ -2026 ముగింపు ఉత్సవాల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ తో చేసిన గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులతో కలిసి ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకాలంలో పొద్దున్నుంచి రాత్రి దాకా చదువు తప్ప ఇంకోటి లేదు. అదొక్కటే సరిపోదు, సంపూర్ణత్వం ఇవ్వదు. విద్యార్థికి తనకాళ్ళ మీద తను నిలబడేలా విద్య ఉండాలి తప్ప.. మార్కులే పరమావధి కాకూడదు. అన్నిటినీ తట్టుకొని నిలబడే మానసిక స్థైర్యం అందించేవి క్రీడలు. ప్రభుత్వంతో పాటు అనేక మంది క్రీడాభిమానులు కలిసి ఈ క్యాంప్ నిర్వహించారు. కోచింగ్ ఇచ్చిన టీచర్లకు, ఓపికగా తీసుకువచ్చిన తల్లిదండ్రులకు, నిర్వాహకులకు, అధికారులకు నా హృదయపూర్వక అభినందనలు. మనం కనకూడని వినకూడని అనేక రుగ్మతలు వెంటాడుతున్నాయి.. వాటి నుంచి దూరం చేయగలిగిన సత్తా క్రీడలకు ఉంది. క్రీడలను ప్రోత్సహిద్దాం మంచి విద్యార్థులను తయారు చేద్దామని అన్నారు.



## తెలంగాణ ఇవ్వొద్దు అని పార్లమెంట్ లో పెప్పర్ స్ప్రే వాడారు

### 12 ఏళ్ల నుండి నీళ్ల మీద ఒక పాలసీ లేదు
### పవన్ కళ్యాణ్ మీటింగ్ కి పరిమిషన్ ఇస్తే ఏమవుతుంది
### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్రాని కాంగ్రెస్ ఇచ్చిందని ..బిఆర్ఎస్ తెచ్చిందని చెప్పుకుంటారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ పాత్ర కూడా ఉంది గమనించాలి. తెలంగాణ ఇవ్వొద్దు అని పార్లమెంట్ లో పెప్పర్ స్ప్రే వాడారు. పార్లమెంట్ లో బిల్లు పెట్టినపుడు కేసీఆర్, విజయశాంతి లేరు. బీజేపీ సపోర్ట్ చేసింది కాబట్టే తెలంగాణ వచ్చిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు అన్నారు.గురువారం ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ద ప్రెస్ లో అయన మాట్లాడారు.రాం చందర్ రావు మాట్లాడుతూ పెప్పర్ స్ప్రే కూడా తెలంగాణని ఆపలేదు. పార్లమెంట్ లో తెలంగాణకు బేసరత్ గా సపోర్ట్ చేసింది బీజేపీ. 1200 మంది కి పైగా బలిదానాలతో తెలంగాణ వచ్చింది. 12 ఏళ్ళు అవుతున్న ఇంకా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితి ఉందని అన్నారు.తెలంగాణ వచ్చిన తరువాత విద్యార్థులకి మనం ఏం చేశాం. తెలంగాణ కోసం పోరాటం చేసిన విద్యార్థుల మీద కేసులు పెట్టారు. కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని చెపుతున్నారు.. వాటి కోసమా విద్యార్థులు పోరాడింది. నియామకాల విషయంలో బిఆర్ ఎస్, కాంగ్రెస్ విఫలమయ్యాయి. జాబ్ క్యాలెండర్ ఏమైంది. ఏ యూనివర్సిటీ చూసినా పార్ట్ టైమ్ ఉద్యోగస్తులతో నడుపుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు రాక 60 మంది చనిపోయారు. మనకి రావాల్సిన నీళ్ల కంటే తక్కువ కి కెసిఆర్ ఒప్పుకున్నారు. 12 ఏళ్ల నుండి నీళ్ల మీద ఒక పాలసీ లేదు. తెలంగాణ ప్రజలకి రావలసిన కృష్ణా వాటర్ ని డీకే శివకుమార్ కి రేవంత్ రెడ్డి బహుమతిగా ఇచ్చారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీలు విఫలమయ్యాయని అన్నారు.13 లక్షల కోట్ల రూపాయల నిధులను కేంద్రం తెలంగాణ కు ఇచ్చింది.. బిఆర్ ఎస్, కాంగ్రెస్ కి అవకాశం ఇచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ కి అవకాశం ఇవ్వాలని తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. తెలంగాణలో బీజేపీ రాజకీయ శక్తిగా ఎదిగింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో మాకు అనుకూలంగా పలితాలు వచ్చాయి. మోదీ సభ కి నేను ఊహించిన దానికంటే ఎక్కువ ప్రజలు వచ్చారు. రైతుల కోసం బీజేపీ భరోసా తో పోరాటం చేసింది. త్వరలో ఫీజ్ రీయంబర్స్ మెంట్ పై పోరాటం చేస్తాం. ఉత్తర తెలంగాణలో అన్ని కార్పొరేషన్ లల్లో మేమే సింగిల్ మెజారిటీ పార్టీ గా మేం ఉన్నాం. ప్రజల్లో బీఆర్ ఎస్ లేదు.. బిఆర్ ఎస్ సిట్టింగ్ ఎంఎల్సీ స్థానంలో కూడా ఓడిపోయింది. ఒక్క వార్డ్ మెంబర్ లేని త్రిపురా లో మేము మూడు సార్లు అధికారంలోకి వచ్చాం. ప్రజలు ఊహించని విధంగా బెంగాల్ లో అధికారంలోకి వచ్చాం. తెలంగాణలో మేము అధికారంలోకి వచ్చాం. మేము హిందుత్వం పైనే పోరాటం చేయం..అభివృద్ధి పై పోరాటం చేస్తాం. బీజేపీ ధ్యేయం ప్రజా సంక్షేమం. తెలంగాణ రాజకీయాల్లో మేము సూపర్ హీరో. పవన్ కళ్యాణ్ మీటింగ్ కి పరిమిషన్ ఇస్తే ఏమవుతుందని ప్రశ్నించారు.తెలంగాణ సెంటిమెంట్ ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదు. తెలంగాణ ను వ్యతిరేకించిన ఎంఐఎం ని దగ్గరకి తీసుకున్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారిని తీసుకొచ్చి మంత్రి పదవులు ఇచ్చింది బిఆర్ఎస్. ఆంధ్రప్రదేశ్ లో బిఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా. తెలంగాణ ప్రజల డబ్బులను పంజాబ్ లో కెసిఆర్ పంచలేదా. లక్ష నాగళ్లతో రామోజీ ఫిలిం సిటీని దున్నుతాం అని కెసిఆర్ అన్నారని అయన గుర్తు చేసారు.



## ప్రో. నాగేశ్వర్ పై రాద్దంతం తగదు

హైదరాబాద్ప్రొఫెసర్ నాగేశ్వర్ విశ్లేషణలపై కక్షపూరిత దాడిని ఖండిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ లు కోదండరాం, అద్దంకి దయాకర్, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివ రావు తదితరులు పాల్గొన్నారు.పలువురు వక్తలు మాట్లాడుతూ సినిమాల్లో వేషాలు మార్చినట్లుగా పవన్ కళ్యాణ్ మాటలు మారుస్తున్నాడు. ఎర్ర కండువా వేశాడు.. చేగువేరా బొమ్మ పెట్టుకున్నాడు. ఇప్పుడు ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదు. సిద్ధతంతం మార్చుకొని ఇప్పుడు సనాతన ధర్మం అంటున్నాడు. రాజకీయ పార్టీ కట్టిన వ్యక్తినీ ఇక్కడికి రా వద్దని ఎవరైనా అన్నారా. ఉన్న సోర్సు ప్రకారం నాగేశ్వర్ మాట్లాడారు.అభ్యంతరం రావడంతో తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు. అయినా ఈ విషయంలో రాద్ధాంతం చేయడం కరెక్ట్ కాదు. పవన్ కళ్యాణ్ కు తెలంగాణపై ప్రేమ బంధం లేదా ఇక్కడ రాజకీయాలను అస్థిరం చేయాలి అని ఆలోచిస్తున్నాడా తెలియడం లేదు.

## దొంగ సొత్తుతో ఎస్సీవో వ్యవహారం

వికారాబాద్ ,తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దొంగ తనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను వికారాబాద్ పోలీసులు అరెస్టు చేసారు. అంతరాష్ట్ర దొంగ వికాస్ సింగ్ ను మీడియా ముందు ప్రవేశపెట్టి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వివరాలను వెల్లడించారు. గత నెల 5న వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్ లోని ఓ ఇంట్లో చొరబడి ఒకటిన్నర తులాల బంగారం, 2,10000ల నగదు దొంగతనం జరిగింది. వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల్లో పరిశీలించి చూస్తే కరడు గట్టిన వికాస్ సింగ్ ను గుర్తించి రైల్వే స్టేషన్ లో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న వికాస్ సింగ్ ను విచారించగా విస్మయానికి గురయ్యే విషయాలు వెలుగులోకి వచక్చాయి. నిందితుడు 16సంవత్సరాల వయస్సు నుంచే నేర జీవితాన్ని ప్రారంభించడు. గతంలో సంగారెడ్డి, బొల్లారం ప్రాంతాల్లో 34కేసులు నమొదై జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి తిరిగి వచ్చిన వికాస్ మారకపొగా వికారాబాద్ జిల్లా, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలో మరో 27రాత్రి పూట దొంగతనాలకు పాల్పడినట్లు ఎస్పీ వెల్లడించారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థలలో ఒకటి


### ప్రతిఏటా "తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్" కార్యక్రమం
### తెలంగాణ పోలీస్ అకాడమీని సందర్శించిన డీజీపీ సివి ఆనంద్



హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్, హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ ను సందర్శించారు.అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్ట్ డీజీపీ కి స్వాగతం పలికారు. గౌరవ వందనం తర్వాత డీజీపీ అకాడమీలోని యూనిట్ ఆసుపత్రి, పరిపాలనా విభాగం, ఆడిటోరియం, తరగతి గదులు, మెస్‌లు, క్రీడా భవన్, ఫైరింగ్ రేంజ్, పరేడ్ గ్రౌండ్ తదితర ముఖ్య భవనాలు, శిక్షణా సదుపాయాలను పరిశీలించారు.ఆ తర్వాత సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అకాడమీలో నిర్వహిస్తున్న ఇండక్షన్ మరియు ఇన్ సర్వీస్ శిక్షణా కార్యక్రమాలు, సిలబస్, సంస్థాగత బాధ్యతలు, మౌలిక వసతులు, భవన సదుపాయాలు, నిర్వహించిన వర్క్‌షాప్‌లు మరియు సెమినార్‌లు, సంక్షేమ కార్యక్రమాలు, అలాగే అకాడమీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పై సమగ్ర వివరాలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అధికారులు మరియు సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించిన సి.వి. ఆనంద్, అకాడమీలో శిక్షణ అందిస్తున్న అధికారులను అభినందిస్తూ, రాజా బహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోని అత్యుత్తమ పోలీసు శిక్షణా సంస్థలలో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. పోలీసు శిక్షణలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలంటే అధికారులు, సిబ్బంది మధ్య టీమ్ వర్క్ , సమన్వయం మరియు సంస్థాగత స్ఫూర్తి ఎంతో అవసరమని ఆయన చెప్పారు.దేశంలోని ప్రముఖ శిక్షణా సంస్థలలో ఒకటైన ఔమాంలో తన సేవల్ని గుర్తుచేసుకుంటూ, ప్రొఫెషనల్ పోలీసింగ్‌లో శిక్షణ యొక్క కీలక ప్రాధాన్యాన్ని డీజీపీ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ ట్రైనింగ్ సెంటర్లు (ఖుఅబ), జిల్లా శిక్షణా కేంద్రాలు (ఆఅబ) మరియు ఇతర శిక్షణా సంస్థలను మౌలిక వసతులు మెరుగు పరచడం ద్వారా మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.శిక్షణా కార్యక్రమాల సమర్థవంతమైన నిర్వహణకు అవసరమైన అనుమతులు, ఇతర సంస్థాగత అవసరాల విషయంలో చీఫ్ ఆఫీస్ నుంచి పూర్తి సహకారం అందిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అన్ని ర్యాంక్స్ కు చెందిన పోలీసు సిబ్బందికి తప్పనిసరి శిక్షణా కోర్సులను క్రమబద్ధంగా నిర్వహించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా నొక్కి చెబుతూ, ఇందుకు చీఫ్ ఆఫీస్ నుంచి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందజేయబడతాయని పేర్కొన్నారు.అలాగే, మాదకద్రవ్యాల నియంత్రణ (ఔఆఖా) అమలు, సైబర్ నేరాల దర్యాప్తు, మోటారు వాహనాల చట్టం అమలు, రోడ్డు భద్రత మరియు ఈ అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి వాటి పై ప్రత్యేక దృష్టి సారించాలని అకాడమీ అధికారులకు డీజీపీ సూచించారు. తద్వారా కార్యాచరణ పరమైన పోలీసింగ్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.తెలంగాణ పోలీస్ అధికారుల రిట్రీట్ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో నిర్వహిస్తామని డీజీపీ ప్రకటించారు. అలాగే, మహిళా సిబ్బందికి సంబంధించి సంస్కరణలు, సమగ్ర భాగస్వామ్యం (ఎనిఇశ్రీబీబతిలతిబిఎ), సంస్థాగత మద్దతు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడానికి "తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్" కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో అకాడమీకి చెందిన సీనియర్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## తమిళనాడులో ఫుడ్ పాయిజన్ కలకలం..

### 100 మందికిపైగా అస్వస్థత




జూన్4 : తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. ఓ ప్రైవేట్ కంపెనీ క్యాంటీన్‌లో భోజనం చేసిన అనంతరం 100 మందికిపైగా ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు, వైద్య సిబ్బంది వెంటనే స్పందించి బాధితులను సమీప ఆస్పత్రులకు తరలించారు. బాధితుల్లో పలువురికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించినట్లు తెలుస్తోంది. కొందరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని ఐసీయూలో ఉంచి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు.కంపెనీ క్యాంటీన్‌లో అందించిన ఆహారం కారణంగానే ఈ ఘటన జరిగినట్లు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా బిర్యానీ తిన్న తర్వాత ఉద్యోగులు అస్వస్థతకు గురైనట్లు సమాచారం. దీంతో అధికారులు బిర్యానీ నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. ఆహార నమూనాల పరీక్షల నివేదిక వచ్చిన తర్వాత ఫుడ్ పాయిజన్‌కు అసలు కారణం ఏమిటో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఆహార తయారీ, నిల్వ విధానాలు, పరిశుభ్రత ప్రమాణాలపై కూడా అధికారులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై స్థానిక ఆరోగ్య శాఖ, ఆహార భద్రతా విభాగం అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

## 'మహిళా డిక్లరేషన్ హామీల అమలుకు పోరాటం కొనసాగిస్తాం'

### ఐద్వా నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

నల్లగొండ సిటీ, జూన్ 04 : నల్లగొండ జిల్లా కనగల్లు మండలం తుర్కపల్లి గ్రామంలో గురువారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళా డిక్లరేషన్ అమలు, మహిళల సమస్యలు, సంక్షేమ పథకాలపై సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ములుగు మహిళా డిక్లరేషన్ పేరుతో మహిళలకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే వాటిలో చాలా వరకు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదని అన్నారు. అలాగే మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని చెప్పినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఇప్పటికీ అధిక వడ్డీలకు అప్పులు తీసుకునే పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులురాజకీయాల్లో మహిళలకు 25 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. చదువుకున్న విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు, స్కూటీలు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ విషయంపై కూడా చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళలను లక్షాధికారులుగా చేస్తామని చెప్పి, మహిళా సంఘాలకు తగిన ఆర్థిక సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం వంటి హామీల అమలుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా డిక్లరేషన్‌లో ప్రకటించిన పథకాల అమలుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించకుండా హామీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. మహిళల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక సాధికారత కోసం జిల్లా వ్యాప్తంగా సమగ్ర సర్వేలు నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేసే వరకు ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలు, పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె. సుల్తానా, మహిళా నాయకురాళ్లు ఆదిమల్ల మారెమ్మ, బయలు యాదమ్మ, మీనమ్మ, లక్ష్మి, ప్రశాంతి, దుర్గమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

## టీఎంసీకి మరో షాక్..

### మేయర్ పదవికి దీదీ సన్నిహితురాలు గుడ్‌బై

పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె. రాజీనామా అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. 16 ఏళ్లుగా నేనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఎవరి పట్లా నాకే అసంతృప్తి లేదు. నిబంధనల ప్రకారమే రాజీనామా చేశా. నాకు నేను కొంత సమయం కేటాయించాలి అనుకుంటున్నాను. కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయదలచుకున్నాను' అని చెప్పారు.టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా ఉన్న కృష్ణా చక్రవర్తి తన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. స్థానిక కార్పొరేషన్ అధికారులూ ఆమె




రాజీనామా లేఖ అందిన విషయాన్ని ధ్రువీకరించారు. అలాగే రాష్ట్ర పురపాలక వ్యవహారాల శాఖ మంత్రి, అదనపు ప్రధాన కార్యదర్శికి కూడా లేఖ ప్రతులను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమె రాజీనామా ఆమోద ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు.కాగా.. తృణమూల్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కృష్ణా చక్రవర్తి నిర్ణయం బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. టీఎంసీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన నేతగా, మమతకు అత్యంత సన్నిహితురాలిగా ఆమెకు పేరుండటంతో ఈ రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఆ వీడియోతో వివాదం.. జూన్ 6 నిరసనపై పెరిగిన ఉత్కంఠ!

ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు కాక్రోచ్ జనతా పార్టీ(అఏఖ)కి చెందిన ఓ వీడియో తీవ్ర దుమారం రేపుతోంది. సీజేపీకి మద్దతుదారుడిగా ఉన్న ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది.ఈ వైరల్ వీడియోలో అమిత్ కుమార్ సింధ్ అనే వ్యక్తి నిరసనలో పాల్గొనే వారినుద్దేశించి మాట్లాడుతూ.. 'ఉద్యమ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుంటే అక్కడే అల్లర్లు చెలరేగుతాయి' అని చెప్పినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా.. నిరసనకారులు తమ రక్షణ కోసం పెప్పర్ స్ప్రేలు, కర్రలు వంటి వాటిని వెంట తెచ్చుకోవాలని సూచించినట్లూ ఆ వీడియోలో ఉంది. పోలీసులు నిరసనను అడ్డుకునే అవకాశముందని, ఎలాంటి పరిస్థితులెదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఆ వీడియోలోని అత్యంత వివాదాస్పద భాగంలో.. 'ఇప్పటివరకు చాలా భరించాం. ఈసారి హద్దులు దాటుతాం. నేపాల్‌ను నిర్మిస్తాం' అని వ్యాఖ్యానించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యాఖ్యలపై పలువురు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా.. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈనెల 6న భారత్‌కు రానున్నట్లు సమాచారం. అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు అనుమతులు కోరనున్నట్లు తెలుస్తోంది. ఈ వీడియోపై వివాదం చెలరేగినప్పటికీ.. తమ ఉద్యమం పూర్తిగా శాంతియుతంగానే సాగుతుందని అభిజీత్ దీప్కే అన్నారు. రాజ్యాంగంపై తనకు పూర్తి విశ్వాసముందని, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. ఏది ఏమైనా.. జూన్ 6కు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో.. నిరసన కార్యక్రమం శాంతియుతంగా, చట్టబద్ధమైన పరిమితుల్లోనే కొనసాగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.పరీక్షల ప్రశ్నపత్రాల లీకులు, ఉద్యోగ నియామకాల్లో అవకతవకల అంశాలపై చేపట్టిన ప్రచారాలతో.. సీజేపీకి మద్దతు పెరిగింది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్‌సీ జీడీ వంటి పరీక్షలకు సంబంధించిన వివాదాల వల్ల దేశవ్యాప్తంగా సుమారు 95 లక్షల మంది యువత ప్రభావితమయ్యారని ఆ సంస్థ పేర్కొంటోంది.




## ఎండల ఎఫెక్ట్..

### తెలంగాణలో బీర్ల విక్రయాల జోరు
### రెండు నెలల్లో 14 కోట్ల బీర్లు అమ్మకం..
### ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయం.



హైదరాబాద్, జూన్ 4,తెలంగాణలో మండిపోతున్న ఎండలు బీర్ల అమ్మకాలకు ఊతమిచ్చాయి. ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా బీర్ల విక్రయాలు భారీగా పెరిగి రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సుమారు 4 కోట్ల బీర్లు అదనంగా అమ్ముడవగా, మొత్తం విక్రయాలు 14 కోట్లకు చేరినట్లు సమాచారం.ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్?మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో బీర్ల వినియోగం అత్యధికంగా నమోదైంది. సాధారణ రోజుల్లో 1.5 లక్షల కేసుల వరకు ఉండే అమ్మకాలు, ఎండల తీవ్రత కారణంగా రోజుకు 2.2 లక్షల కేసులకు పెరిగినట్లు తెలుస్తోంది.బీర్ల విక్రయాలు పెరగడంతో ప్రభుత్వానికి ఎక్సైజ్ ఆదాయం కూడా భారీగా సమకూరుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో మద్యం ద్వారా వచ్చే వార్షిక ఆదాయం సుమారు రూ.10 వేల కోట్లుగా ఉండగా, ప్రస్తుతం అది నాలుగు రెట్లు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.వేసవి సెలవులు, పెళ్లిళ్ల సీజన్, అధిక ఉష్ణోగ్రతలు బీర్ల అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా వ్యాపారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలోని వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లలో బీర్లకు భారీ డిమాండ్ కనిపిస్తోంది.అయితే అధిక మద్యం సేవనం ఆరోగ్యానికి హానికరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండల సమయంలో మద్యం సేవించడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

## రమా నందన పై కేసు నమోదు

రంగారెడ్డి,ఇబ్రహీంపట్నంలో ప్రముఖ యూట్యూబర్, మన శంకర వర ప్రసాద్ నటి రమా నందన అలియాస్ నందు కుటుంబంపై కేసు నమోదు అయింది. ముగ్గురిపై కేసు నమోదు!యూకే వీసా రెన్యూవల్ పేరిట రూ. 15 లక్షల టోకరా ఇచ్చినట్లు పిర్యాదు. డెస్టినీ కన్సల్టెన్సీ పేరిట వీసా రెన్యూవల్ చేస్తామంటూ నమ్మించి భారీ మోసానికి నిందితులు పాల్పడ్డారు. వెస్ట్ ఇబ్రహీంపట్నం కి చెందిన మామిళ్ళపల్లి శివక్రాంతి కుమార్ అనే బాధితుడి ఫిర్యాదుతో ఉదంతం వెలుగు చూసింది. బాధితుడు యూకే (జఐ) లో ఉన్న సమయంలో వీసా గడువు ముగిసిపోతుండటంతో డెస్టినీ కన్సల్టెన్సీ నిర్వాహకులను ఆశ్రయించిన వైనం. ఇండియాకు చెందిన తమ బ్రాంచ్లో డబ్బులు చెల్లిస్తే వీసా ప్రాసెస్ చేస్తామని కేటుగాళ్లు నమ్మబలికారు. నిందితుల మాటలు నమ్మి రూ. 15 లక్షల వరకు బాధితుడు కుమార్ చెల్లించాడు. నెలలు గడుస్తున్నా వీసా రాకపోవడంతో పాటు నిందితులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మోసపోయానని గ్రహించాడు.ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో బాధితుడి ఫిర్యాదు ఆధారంగా నిందితులపై క్రైమ్ నంబర్ 515/2025 కింద కేసు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసారు. డెస్టినీ కన్సల్టెన్సీ డైరెక్టర్ జాగర్లమూడి మధుకర్, ఆయన భార్య రమానందన మరియు గుంటూరులో ఉండే మధుకర్ తండ్రి పై కేసు నమోదు అయింది. ఈ ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ బి.రాజు వెల్లడించారు. ఈ కన్సల్టెన్సీ ద్వారా ఇంకా చాలా మంది మోసపోయి ఉండే అవకాశం ఉందన్న అనుమానాలు వున్నాయి. మిగిలిన బాధితుల వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు.

## అంగన్‌వాడీల్లో జూన్ 12 నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకం..

### చిన్నారుల పోషకాహారానికి తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు

హైదరాబాద్, జూన్ 4 తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషకాహార స్థాయిని మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో జూన్ 12 నుంచి బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తొలి దశలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.ఈ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రతిరోజూ ఉప్మా లేదా కిచిడీతో పాటు పాలు అందించనున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజనం, గుడ్లు, ఇతర పోషకాహార పదార్థాలు అందుతున్న నేపథ్యంలో ఉదయం అల్పాహారం కూడా అందించడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది.రాష్ట్రంలో ముఖ్యంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల్లో రక్తహీనత, తక్కువ బరువు, ఎదుగుదల లోపం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. ఉదయం పూట ఖాళీ కడుపుతో కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, ఏకాగ్రత, శారీరక ఎదుగుదల మెరుగుపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఎండల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రకటించిన వేసవి సెలవులను జూన్ 10 లేదా 12 వరకు పొడిగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. సెలవుల పొడిగింపు నిర్ణయం తీసుకుంటే బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు తేదీలో కూడా మార్పులు జరిగే అవకాశం ఉందని సమాచారం.అంగన్‌వాడీ సేవలను మరింత బలోపేతం చేయడం, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడం, బాలల ఆరోగ్య సూచీలను మెరుగుపరచడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలను పరిశీలించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ పథకాన్ని విస్తరించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# జగన్ కు బీఆర్ఎస్ స్థానంలో కవిత

విజయవాడ, జూన్ 4, (న్యూస్ పల్స్)వైసీపీ అధినేత జగన్‌కు ఇరుగు పొరుగు రాష్ట్రాల మద్దతు ఉన్న విషయం తెలిసిందే. సమయం చూసుకు ని స్పందించే నాయకులు ఉన్నారు. అయితే.. ఒక్కొక్కసారి ఆయనను విమర్శించిన పొరుగు రాష్ట్ర నేతలు కూడా కనిపిస్తారు. హరీష్‌రావు, కేటీఆర్‌వంటి తెలంగాణ నాయకులు జగన్‌కు మిత్రులే అయినా.. సమయం సందర్భం చూసుకుని ఆయనను సమర్థించారు. ఒక్కొక్కసారి తీవ్రంగా విమర్శించారు. 4 వేల కోట్ల కోసం.. జగన్.. రైతులను ఫణంగా పెట్టారంటూ.. గతంలో హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అప్పట్లో రైతులు వాడే విద్యుత్‌కు స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయం తీసుకున్నారు జగన్. ఇది కేంద్ర ప్రభు త్వం చెప్పడంతోనే .. చేశారని హరీష్‌రావు చెప్పారు. అంతేకాదు.. ఇలా చేస్తే.. కేంద్రం నుంచి 4 వేల కోట్ల రూపాయల మేరకు జగన్ ప్రభుత్వానికి అప్పుగా వస్తోందన్నారు. ఇది రాజకీయంగా జగన్‌కు ఇబ్బంది సృష్టించింది. ఇక, కేటీఆర్ కూడా.. ఏపీలో వైసీపీ పాలనా సమయంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించి ..ఇరుకున పడేశారు. ఏపీలో ఎక్కడ చూసినాగుంతల రోడ్లే ఉన్నాయని.. తన స్నేహితులు చెప్పారంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ.. జగన్ బీఆర్ఎస్ నాయకుల తో కలివిడిగానే ఉంటున్నారన్న చర్చ ఉంది. కట్ చేస్తే.. ఇప్పుడు బీఆర్ఎస్ స్థానంలో కవిత తెరమీదికి వచ్చారు. నేరుగా జగన్‌ను ఆమె సమర్థించకపోయినా.. అసందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు.. వైసీపీలో చర్చకు దారితీశాయి. జగన్ రాజధాని విషయంలో చేసిన 'మావిగన్' ప్రకటనను కవిత స్వాగతిస్తున్నట్టుగా మాట్లాడారు. దీనిని అడ్డు పెట్టుకుని కూటమి ప్రభుత్వంపైనా ముఖ్యంగా సీఎం చంద్రబాబుపైన, రాజధాని అమరావతిపైనా విమర్శలు గుప్పించారు. దీంతో వైసీపీ నాయకులు తమ కు బూస్ట్ వచ్చిందని అనుకుంటున్నారు. కానీ, ఇది వాపే తప్ప బలుపు కాదని.. తెలంగాణ నాయకులను విశ్వసించడం సరికాదని చెబుతున్న వారు కూడా ఉన్నారు. ఎప్పుడు ఎలాంటి టర్న్ తీసుకుంటారో తెలియని.. కవిత గారి లాంటి నాయకులను నమ్మితే.. నిండా మునగడం కాయమ ని అంటున్నారు. కాబట్టి.. కవిత ఏదో చెప్పారని.. చంద్రబాబుపై విమర్శలు గుప్పించారని.. పొంగిపోతే.. అది మొత్తానికే



ఇబ్బంది అవుతుందని చెబుతున్న నాయకులు కూడా ఉన్నారు.ఏపీలో సింపతీ పాలిటిక్సే నడుస్తున్నాయా? అంటే.. అవుననే సమాధానమే వినిపిస్తోంది. వాస్తవానికి రాజకీయాల్లో సింపతీ కావాల్సిందే. కానీ, అది కొన్ని కొన్ని సార్లు ఫలిస్తుంది.. మరికొన్ని సార్లు వికటిస్తుంది. ప్రజలు ఏది తమకు అనుకూలమని భావిస్తే.. అదే జరుగుతుంది. కానీ.. ప్రస్తుతం వైసీపీకి సింపతీ రాకుండా చేయాలన్న వ్యూహంతో కూటమి ప్రభుత్వం.. చంద్రబాబుకు సింపతీ రాకుండా చేయాలన్న లక్ష్యంతో వైసీపీ అడుగులు వేస్తున్నాయి ఈ క్రమంలోనే వైసీపీ నాయకులు.. పార్టీ అధినేత కూడా.. సంక్షేమ కార్యక్రమాలు సహా.. డీఎస్సీ వంటివాటిని తెరమీదికి తెచ్చారు. వాస్తవానికి సంక్షేమ కార్యక్రమాలు బాగానే వర్కవుట్ అవుతున్నాయి. కానీ, లోపాల ను వెతికి మరీ.. వైసీపీ నాయకులు కూటమి సర్కారును టార్గెట్ చేస్తున్నారు. దీనివల్ల తమకు మేలు జరుగుతుందని అనుకుంటున్నారు. కానీ, ప్రజలకు కూడా ఒక ఆలోచనా విధానం అయితే ఉంటుంది. వారు కూడా సంక్షేమంపై ఒక నిర్దేశిత అంచనాతో ఉన్నారు.ఈ నేపథ్యంలో వైసీపీ ఎంచుకున్న సింపతీ పాలిటిక్స్ ఏమేరకు వర్కవుట్ అవుతాయన్నది ప్రశ్న. ఇక, టీడీపీ విషయానికి వస్తే.. జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకుంది. తద్వారా .. జగన్‌కు ప్రజల్లో సింపతీ రాకూడదన్నది టీడీపీ నాయకుల లక్ష్యంగా కనిపిస్తోంది. విధానపరమైన అంశాలపై వైసీపీ విమర్శలు చేస్తే.. దానికి కౌంటర్లు ఇవ్వడం వరకు తప్పులేదు. కానీ.. లేనిపోని వ్యాఖ్యలు చేస్తే.. ప్రజల్లో దీనికి వ్యతిరేక భావన ఏర్పడుతుంది. ఫలితంగా.. అది బూమరాంగ్ అవుతుంది. గతంలో సింపతీ పాలిటిక్స్ విషయంలో వైసీపీకి, టీడీపీకి కూడా అనుభవం ఉంది. చంద్రబాబును తిట్టినా.. జగన్‌కు ప్రజలు ఓటేయలేదు.జగన్‌పై విమర్శలు చేసినా.. 2019లో టీడీపిని పట్టించుకోలేదు. కేవలం పాలనను చూసి..అమలు చేస్తున్న పథకాలను చూసి.. ప్రత్యర్థులు ఇస్తున్న హామీలను గమనించే ప్రజలు ఓటేస్తున్న విషయం 2024 ఎన్నికల్లో స్పష్టమైంది. సో.. ఇప్పటికీ సింపతీని నమ్ముకుంటామంటే.. అది బూమరాంగే అవుతుంది తప్ప.. కలిసి వచ్చే అవకాశం కనిపించడం లేదని పరిశీలకులు చెబుతున్నారు.

# లోకల్ బాడీ ఎన్నికలకు కమిటీ

విజయవాడ, జూన్ 4, (న్యూస్ పల్స్)ఏపీలో ఒక రకమైన అనుమానం ఉండేది. కూటమి ప్రభుత్వం ఎన్నాళ్లు నడుస్తుందో చెప్పలేం అన్నవారు ఎక్కువగా ఉండేవారు ఎన్నికల సమయంలో. ఎందుకంటే చాలా రాజకీయ పార్టీల మధ్య పొత్తు కొద్ది రోజులకే విచ్ఛిన్నం అవుతూ వచ్చింది. అలాగే ఏపీలో కూటమిలోని టిడిపి, జనసేన మధ్య విభేదాలు వస్తాయని ఎక్కువ మంది ఆశించారు. కానీ వారి ఆశలు తీరలేదు. గత రెండేళ్లుగా రెండు పార్టీల మధ్య బంధం పెరుగుతుందే తప్ప తగ్గేదిగా కనిపించడం లేదు. అయితే క్షేత్రస్థాయిలో క్యాడర్ మధ్య మాత్రం విభేదాలు ఉన్నాయి. ఆ విషయం ఇరుపార్టీల అధినేతలకు తెలుసు. అయితే విభేదాలు ఎంత ఉన్నాయో అంతకుమించి ప్రచారం చేస్తోంది వైసీపీ సోషల్ మీడియా. ఏదైనా పరిణామం జరిగితే చాలు సోషల్ మీడియాను నింపేస్తోంది. కానీ వారి మధ్య ఎటువంటి అరమరికలు లేకుండా సజావుగా కొనసాగుతోంది పొత్తు. అయితే ఎంత పొత్తు ఉన్న ఓట్ల బదలాయింపు జరిగితేనే.. దానికి సరైన ఫలితం వస్తుంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఇదే మాదిరిగా సత్ఫలితం చూసింది కూటమి. అయితే మరోసారి అటువంటి ఫలితాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో చూడాలని భావిస్తున్నారు సీఎం చంద్రబాబు.ఏపీలో స్థానిక సంస్థలకు సంబంధించి పాలకవర్గాల గడువు ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. త్వరలో ఎన్నికలకు వెళ్లేందుకు సన్నాహాలు చేస్తోంది ప్రభుత్వం. అయితే చంద్రబాబు జరుపుతున్న ఈ జాప్యం వెనుక చాలా రకాల వ్యూహాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా స్థానిక సంస్థల్లో సైతం కూటమి పార్టీల మధ్య ఓట్ల బదలాయింపు జరగాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అందుకు ఆయన ఒక వ్యూహం రూపొందించారు. నియోజకవర్గ, మండల స్థాయిలో ఎన్డీఏ సమన్వయ కమిటీ సమావేశాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ నెల నాలుగున జరగనున్న ఎన్డీఏ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.సార్వత్రిక ఎన్నికల వరకు పొత్తు ఓకే. కానీ స్థానిక సంస్థల ఎన్నికలు అలా కాదు. అక్కడ స్థానిక పరిస్థితులు విపరీతంగా ప్రభావం చూపుతాయి. నేతలు ఆశావహులుగా ఉంటారు. ఈ క్రమంలో ఎన్నికలు నిర్వహిస్తే కూటమి నేతల మధ్య ఘర్షణతో పాటు వివాదాలు జరుగుతాయి. దీనిని ముందుగానే గ్రహించారు సీఎం చంద్రబాబు. అందుకే కూటమి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఏ మండలంలో ఎవరు జడ్పిటిసి గా పోటీ చేయాలి? సర్పంచ్ గా ఎవరికి అవకాశం కల్పించాలి? ఎంపీపీగా ఎవరికి ఛాన్స్ ఇవ్వాలి? ఆశావహుడు ఎప్పుడు నుంచి పనిచేస్తున్నారు? స్థానికంగా బలం ఎంత? ఇలా అన్ని వివరాలను ఆరా తీస్తుంది ఈ కమిటీ. ఒకవేళ బహుముఖ పోటీ ఉంటే సమన్వయం చేసుకొని ముందుకు సాగుతుంది. అప్పుడే ఓట్ల బదలాయింపు జరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఓటమి ఇచ్చేందుకు ఈ ప్రయత్నం గా తెలుస్తోంది. రేపు ఈ కమిటీల గురించి ప్రత్యేక ప్రకటన చేస్తారు సీఎం చంద్రబాబు.

# షర్మిలకు డీకే షాక్

కడప జూన్ 4, (న్యూస్ పల్స్)రాజ్యసభ పదవిపై ఆశలు పెట్టుకున్నారు షర్మిల. ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి పిలుపు రావడంతో ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అక్కడ రాజ్యసభ భరోసా రావడంతో ఆనందంతో కనిపించారు. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అవుతున్నట్లు తెలుస్తోంది. రాజ్యసభ పదవి కష్టమేనన్న టాక్ నడుస్తోంది. దానికి కారణం లేకపోలేదు. కర్ణాటక రాజకీయాలు మారడంతో.. షర్మిలకు ఈసారి అవకాశం ఉంటుందా లేదా అనేది ఒక అనుమానం. ఎందుకంటే ఆమె కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నిక కావాలి. కానీ అక్కడ పరిస్థితి ఏమంత బాగాలేదు. అందుకే కాంగ్రెస్ అగ్ర నాయకత్వం పునరాలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే షర్మిలకు షాక్ తగిలినట్లే.తన తండ్రి పేరుతో తెలంగాణలో పార్టీ ఏర్పాటు చేశారు షర్మిల. అక్కడ రాజకీయాల్లో రాణించాలని భావించారు. సుదీర్ఘ పాదయాత్ర కూడా చేశారు. కానీ అనుకున్న స్థాయిలో వర్కౌట్ కాలేదు. దీంతో తన పార్టీని ఏదో ఒక జాతీయ పార్టీలో విలీనం చేయాలని భావించారు. తన తండ్రి ఇష్టపడే కాంగ్రెస్ పార్టీలోనే విలీనం చేశారు చివరకు. అలా విలీనం చేసినందుకు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించారు. కానీ కాంగ్రెస్ హై కమాండ్ మాత్రం ఏపీ బాధ్యతలు అప్పగించింది. అచేతనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీని ఊపిరి పోయాలని భావించింది. అందుకు అప్పట్లో రాజ్యసభ పదవి ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లకు కర్ణాటక నుంచి మూడు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతుండడంతో.. షర్మిలకు ఇచ్చిన హామీ అమలు చేసేందుకు కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. పైగా వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు డి కే శివకుమార్. షర్మిలకు రాజ్యసభ పదవి దక్కుతుందంటే ఆయన సైతం సంతోషిస్తారు. ఆ నమ్మకంతోనే అగ్రనేత రాహుల్ ఢిల్లీకి పిలిపించి రాజ్యసభ పదవి ఇస్తామని షర్మిలకు చెప్పారు. అయితే ఇప్పుడు మొత్తం సీన్ రివర్స్ అవుతున్నట్లు ప్రచారం నడుస్తోంది.. అయితే అదే కర్ణాటక నుంచి షర్మిల కు అవకాశం ఇచ్చేందుకు కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాలు జారీచేసింది. అయితే ఈ నిర్ణయంతో కర్ణాటక కాంగ్రెస్ నాయకులు అసంతృప్తికి గురవుతున్నారు. మరో రెండేళ్లలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇవి డీకే శివకుమార్ పనితీరుకు అజెండాగా నిలవనున్నాయి. అయితే ప్రారంభంలోనే రాజ్యసభ పదవి ద్వారా కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి రేగే అవకాశం ఉంది. కాంగ్రెస్ నుంచి చాలామంది నేతలు రాజ్యసభ పదవి ఆశిస్తున్నారు. ఇప్పుడు ఆ పదవిని షర్మిలకు ఇస్తే ఆ ప్రభావం డీకే శివకుమార్ పై పడుతుంది. అయితే ఇప్పుడు డీకే శివకుమార్ షర్మిల విషయంలో వెనక్కి తగ్గుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే షర్మిలకు షాక్ తగిలినట్టే.

# ట్రెండింగ్ లో లేబర్ అడ్డా

గుంటూరు, జూన్ 4, (న్యూస్ పల్స్)ఏదైనా భవన నిర్మాణమైనా, రోడ్డు నిర్మాణమైనా? అందుకోసం చాలా మంది కార్మికులు అవసరం. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు.. ఆయా నిర్మాణాల కోసం సరిపడ డబ్బు, ఇతరత్రా సామాగ్రి ఉన్నా.. కార్మికులు లేకపోతే? ఆ పని ఇంచు కూడా కదలదు.ఇప్పుడు అన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా సాగుతున్న వేళ? కార్మికుల పాత్ర మరింతగా పెరిగిపోయింది. ఇక ఏపీ రాజధాని అమరావతి విషయానికి వస్తే? వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు వస్తున్నారు. వెళుతున్నారు. ఒక్కో కాంట్రాక్టరు ఒక్కో రీతిన వ్యవహరిస్తున్న కారణంగా కార్మికులు ఇబ్బందులు పడుతున్న వైనం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కార్మికుల వసతి కోసం పక్కా ఏర్పాట్లు చేయాలని కూటమి సర్కారు తన కాంట్రాక్టర్ల తెగేసి చుబుతోంది.కాంట్రాక్టర్లకు మాట మాత్రంగా చెప్పడానికి బదులుగా అసలు కార్మికుల వసతి కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? ఆయా లేబర్ అడ్డాల్లో ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి? వంటి విషయాలను విస్పష్టంగా చెప్పేందుకు కూటమి సర్కారు రంగంలోకి దిగింది. ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ సెంటర్ (లేబర్ అడ్డా) నమూనాను గుంటూరులో ఏర్పాటు చేసింది. అందులో కార్మికుల వసతి కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లను కళ్లకు కట్టినట్టు చూపింది.లేబర్ అడ్డాల్లో ఆయా ఏర్పాట్లతో పాటుగా కార్మికులకు తమ హక్కులు, బాధ్యతలపై మరింత అవగాహన పెంచే దిశగా పలు సూచనలు సలహాలను ఆ లేబర్ అడ్డాలో పొందుపరచింది. చదువు వచ్చిన కార్మికులతో పాటుగా చదువు రాని వారికి కూడా సులభంగ అర్థమయ్యేలా ఈ అవగాహన ప్రకటనలను పొందుపరచిందిఅమరావతి పరిధిలోనే కాకుండా ఇతరత్రా పని ప్రదేశాల్లో కూడా కార్మికుల కోసం ఈ తరహా లేబర్ అడ్డాలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దిశానిర్దేశం చేసింది.

# టీడీపీలో అనంత లొల్లి....

అనంతపురం, జూన్ 4,అనంతపురం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీలో ముసలం మొదలయింది. అక్కడ మాజీ ఎమ్మెల్యేకు, ప్రస్తుత ఎమ్మెల్యేకు మధ్య గత కొన్నేళ్ల నుంచి పడటం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఎంతగా అంటే.. తాను వచ్చే ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోనని ప్రభాకర్ చౌదరి ప్రకటించారు. తాను పార్టీ హైకమాండ్ ను టిక్కెట్ ను కూడా కోరనని అన్నారు. అదే సమయంలో డీలిమిటేషన్ లో మరొక నియోజకవర్గంలో అవకాశమిస్తే వెళతానని, లేకుంటే పోటీకి దూరంగా ఉంటానని ప్రభాకర్ చౌదరి ప్రకటించారు.ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. గత ఎన్నికల్లో ప్రభాకర్ చౌదరిని కాదని తెలుగుదేశం పార్టీ నాయకత్వం దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ కు టిక్కెట్ ఇచ్చింది. కూటమి హవాలో ఆయన గెలుపొందారు. అయితే గెలిచిన నాటి నుంచి ప్రభాకర్ చౌదరిని పక్కన పెడుతూ వస్తున్నారు. ఆయన వర్గాన్ని కూడా దూరం పెడుతున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య సోషల్ మీడియాలో గత కొంతకాలంగా వార్ నడుస్తుంది. దీనిపై పార్టీ హైకమాండ్ స్పందించి వెంటనే ఇద్దరినీ పిలిపించి క్లాస్ పీకారు. అయినా మార్పు రాలేదు. దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ తన అనుచరులను కావాలనే తొక్కేస్తూ నియోజకవర్గంలో ఇబ్బందులు పెడుతున్నారన్నది ప్రభాకర్ చౌదరి ఆరోపణ.మరొకవైపు త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. కార్పొరేషన్ ఎన్నికల్లో వంద శాతం సీట్లు గెలుస్తామని, ఎవరు అడ్డం పడినా గెలిచేది టీడీపీయేనని, తానేంటో చూపిస్తానని దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ మీడియా సమావేశం పెట్టి పరోక్షంగా ప్రభాకర్ చౌదరిపై సవాల్ విసిరారు. అనంతరం ప్రభాకర్ చౌదరి తాను వచ్చే ఎన్నికల్లో హైకమాండ్ తనకు అనంతపురం బీఫారం ఇచ్చినా తీసుకోనని, తాను పోటీ చేయనని చెప్పేశారు. ఇది తన వ్యక్తిగత నిర్ణయమని, ఆయన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు కదా? ఎన్నిసార్లు గెలుస్తారో గెలవనీయండి అంటూ సెటైరికల్ గా మాట్లాడుతుండటంతో వీరిద్దరి మధ్య వార్ స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. మొత్తం మీద అధికార టీడీపీలో ఈ విభేదాలు హైకమాండ్ జోక్యంతోనూ సమసిపోయేలా కనిపించడం లేదు.

# కొడాలి అర్జున్ ఎంట్రీ....

మచిలీపట్టణం, జూన్ 4, మాజీ మంత్రి కొడాలి నాని రాజకీయ వారసుడిపై క్లారిటీ వచ్చేసింది. మాజీ మంత్రి పేర్ని నాని కొడాలి నాని రాజకీయ వరసుడు ఎవరో చెప్పేశారు.. 2034 ఎన్నికల్లో కొడాలి అర్జున్ గుడివాడ నుంచి బరిలో ఉంటాడని ప్రకటించారు. కొడాలి నానితో కలిసి అర్జున్ గుడివాడలో సర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంలో పేర్నినాని కీలక ప్రకటన చేశారు.గుడివాడ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం జరిగింది.. మాజీ మంత్రి కొడాలి నాని రాజకీయ వారసత్వంపై కీలక ప్రకటన వచ్చేసింది. కొడాలి నాని రాజకీయ వారసుడు ఎవరో మాజీ మంత్రి కొడాలి నాని ప్రకటించారు. గుడివాడ లింగవరంలోని కె కన్వెన్షన్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)పై వైఎస్సార్‌సీపీ నేతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నానిలతో పాటుగా వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ వేదికపై నుంచి మాజీ మంత్రి పేర్ని నాని కొడాలి నాని రాజకీయ వారసుడు కొడాలి అర్జునరావు అంటూ ప్రకటించారు. కొడాలి అర్జున్ 2034 ఎన్నికల్లో పోటీచేస్తారని పేర్ని నాని తెలిపారు.కొడాలి అర్జున్ నాని సోదరుడి కుమారుడు.. కొంతకాలంగా గుడివాడ వైఎస్సార్‌సీపీలో యాక్టివ్ అయ్యారు. గుడివాడలో సర్‌పై నిర్వహించిన సదస్సుకు అర్జున్ వచ్చారు.. వేదికపై మాజీ మంత్రులు, పార్టీ నేతల మధ్య కూర్చున్నారు. అర్జున్ 2034 ఎన్నికల్లో పోటీచేస్తారని



ప్రకటించడంతో.. 2029 ఎన్నికల్లో కొడాలి నాని ఎన్నికల బరిలో ఉంటారనే క్లారిటీ వచ్చింది. కొడాలి నానికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.. కానీ తన సోదరుడి కుమారుడు అర్జున్‌ను రాజకీయ వారసుడిగా ప్రకటించారు. గతంలో కూడా పలు సందర్భాల్లో కొడాలి నాని తన రాజకీయ వారసత్వం గురించి ప్రకటనలు చేశారు.2024 ఎన్నికల సమయంలో కూడా కొడాలి నాని సోదరుడి కుమారుడు అర్జున్ తన రాజకీయ వారసుడని ప్రకటించిన సంగతి తెలిసిందే. తనకు 2024 ఎన్నికలే చివరివి అని చెప్పారు. 2029 ఎన్నికల్లో తాను పోటీచేయనని.. తన వయసు గురించి ప్రస్తావించారు. 2029 ఎన్నికల సమయానికి తనకు 58 ఏళ్లు వస్తాయని.. తాను ఆ వయసులో మళ్లీ ఎన్నికల్లో పోటీచేయలేనని చెప్పుకొచ్చారు. తన కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి రారని.. తన ఇద్దరు కుమార్తెలకు రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి లేదన్నారు. తన తమ్ముడి కుమారుడు రాజకీయాల్లోకి వస్తారని చెప్పారు. ఇప్పుడు మాజీ మంత్రి పేర్ని నాని ప్రకటనతో కొడాలి అర్జున్ పొలిటికల్ ఎంట్రీ ఖాయమైందనే చర్చ జరుగుతోంది.మరోవైపు గుడివాడలో జరిగిన సర్ సదస్సులో మాజీ మంత్రి పేర్ని నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో గుడివాడ, గన్నవరం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు లేవని టీడీపీలో చర్చ జరుగుతోందన్నారు. సర్ విషయంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సర్ కారణంగా తమిళనాడులో స్టాలిన్, పశ్చిమ బెంగాల్‌లో మమత బెనర్జీ ఓడిపోయారన్నారు మాజీ మంత్రి కొడాలి నాని. వారు పోటీచేసిన నియోజకవర్గాల్లో ఓట్లు తొలగించడంతోనే ఇలా జరిగిందని చెప్పుకొచ్చారు. సర్ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

# కాంగ్రెస్ గూటికి జగన్

## శివకుమార్ కు అధిష్టానం టాస్క్

విజయవాడ, జూన్ 4,కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు తీసుకోనున్నారు. ఇటీవల సిద్దరామయ్య తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం వ్యూహాత్మకంగా డీకే శివకుమార్ కు కర్ణాటక బాధ్యతలు అప్పగించింది. అయితే కేవలం కర్ణాటకలో రాజకీయ ప్రయోజనాలు పొందడం కాదు.. దక్షిణ భారతదేశంలో బలమైన శక్తిగా కాంగ్రెస్ పార్టీని తీర్చిదిద్దేందుకు డీకే శివకుమార్ ద్వారా అగ్ర నాయకత్వం బలమైన స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక, కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. తమిళనాడులో కాంగ్రెస్ సహకారంతో విజయ్ ప్రభుత్వం నడుస్తోంది. దక్షిణాది రాష్ట్రాలను మరింత బలమైన క్యారీడార్ గా రూపొందించుకొని.. 2029 ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాలు దక్కించుకోవాలన్నది కాంగ్రెస్ అగ్ర నాయకత్వం ప్లాన్. అయితే కాంగ్రెస్ పార్టీకి ఎంతో కొంత లోటు అనేది ఏపీ నుంచి ఉంది. దానిని భర్తీ చేసే బాధ్యతను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. డీకే శివకుమార్ కు అప్పగించినట్లు తెలుస్తోంది.ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ అంత జగన్మోహన్ రెడ్డి వైపు ఉంది. షర్మిల ద్వారా దాని టర్న్ చేసే ప్రయత్నం జరిగిన వర్కౌట్ కావడం లేదు. ఇప్పుడున్న ఏకైక మార్గం జగన్మోహన్ రెడ్డి వద్ద ఉన్న ఓటు బ్యాంకు కాంగ్రెస్ పార్టీ వైపు టర్న్ చేయడం.. లేకుంటే జగన్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడం.. అది కాదంటే జగన్మోహన్ రెడ్డితో పొత్తు పెట్టుకోవడం. అయితే కాంగ్రెస్ పార్టీతో దోస్తీ అంటేనే అంత ఈజీగా జగన్మోహన్ రెడ్డి ఒప్పుకునే పరిస్థితి లేదు. అది డీకే శివకుమార్ ద్వారా చేయాలన్నది రాహుల్ గాంధీ ప్లాన్. రాజశేఖర్ రెడ్డి ఉన్న నాటి నుంచి కుటుంబ, వ్యాపార సన్నిహితుడు డికె శివకుమార్. ఆ కుటుంబం బలం, బలహీనతలు తెలుసు. పైగా ఆస్తి పంచాయితీలు ఇప్పుడు నడుస్తున్నాయి. ఆపై జగన్మోహన్ రెడ్డికి బెంగళూరులో విలువైన ఆస్తులు ఉన్నాయి. ఈ పరిణామాల క్రమంలో డీకే శివకుమార్ జగన్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీతో కలపగల శక్తి కలిగి ఉన్నారు. అందుకే అగ్రనేత రాహుల్ కీలక టాస్క్ ఇచ్చినట్లు తెలుస్తోంది.2029 ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలో కూటమి అధికారంలోకి రావాలి అంటే దక్షిణాది రాష్ట్రాలు కీలకం. ఐదు రాష్ట్రాలు ఉంటే అందులో మూడింట నేరుగా అధికారంలో ఉంది. మరో రాష్ట్రంలో అధికార భాగస్వామిగా ఉంది. ఏపీలో మాత్రం టీడీపీ కూటమి ఉంది. ఆ కూటమిని ఢీ కొట్టాలంటే జగన్మోహన్ రెడ్డికి మిగతా రాజకీయ పక్షాలు సాయం అవసరం. అందుకే ఆయనను కాంగ్రెస్ గూటికి తెచ్చేందుకు శివకుమార్ అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. 135 పార్లమెంట్ స్థానాలు ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో మెజారిటీ సీట్లు వస్తే ఈజీగా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొన్న పరిస్థితులు జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే ఆయన బిజెపి నుంచి బయటకు వచ్చినట్టు కనిపిస్తున్నారు. ఇదే ఊపుతో డీకే శివకుమార్ పట్టు బిగిస్తే.. జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.



# రోజూ మొలకలు తింటున్నారా.. అయితే, ఇది తెలుసుకోవాల్సిందే..!!



మొలకలు పోషకాలకు నిలయాలు. మొలకలు పోషకాలకు నిలయాలు. అవి అన్ని అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. ఉదయం మొలకలు తినడం ఆరోగ్యకరమైన మార్గాలలో ఒకటిగా పరిగణిస్తారు. మొలకలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, శక్తి స్థాయిలను పెంచడం, ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా సహాయపడతాయి. ఇవి మొత్తం శరీరానికి మేలు చేస్తాయని వీటిని రోజూ ఆహారంలో భాగంగా తీసుకునే ప్రయత్నం చేయాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే, మొలకలు తీసుకోవాల్సిన పరిమాణం.. ఎవరు ఏ విధంగా తీసుకోవాలో సూచిస్తున్నారు. మొలకలు సహజ సిద్దమైన పోషకాలు అందిస్తాయి. మొలకలను ఉదయం పూట తీసుకోవడం వల్ల ఆహారం సులభంగా విచ్ఛినం అవుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల పేగుల కదలికలు ఎక్కువగా ఉంటాయి. మలబద్దకం సమస్య తగ్గుతుంది. పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మొలకల్లో సహజంగా ఉండే జీర్ణ ఎంజైమ్ లు ప్రోటీన్లతో పాటుగా మొలకల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. మొలకెత్తిన గింజల్లో విటమిన్స్, మినరల్స్ మరియు యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. దీని వలన ఎనర్జీగా ఉంటారు, ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఉదయం పూట మొలకలను తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్ లు మన దరి చేరకుండా ఉంటాయి. ఆరోగ్య ప్రయోజనాలు మొలకలు రెగ్యులర్ గా తీసుకోవటం ద్వారా దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటాం. వీటిని అల్పాహారంలో భాగంగా క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల సాధారణ జలుబు, కాలానుగుణంగా వచ్చే ఫ్లూ వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. సాధారణంగా మొలకల్లో ప్రోటీన్, ఐరన్, క్యాల్షియం వంటి పోషకాలు ఉంటాయి. నీరసం, అలసట వంటి సమస్యలు మన దరి చేరకుండా ఉంటాయి. మొలకల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి., ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు వీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. మొలకల్లో విటమిన్ ఎ, సి, ఇ వంటివి ఉంటాయి. ఉదయం పూట మొలకలను తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృద్ధాప్య ఛాయలు మన దరి చేరకుండా ఉంటాయి. జుట్టు కుదుళ్లు బలంగా తయారవుతాయి. జుట్టు రాలడం తగ్గుతుంది. మొలకలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మెరిసే ఆరోగ్యకరమైన జుట్టును సొంతం చేసుకోవచ్చు. ఇలా అనేక రకాలుగా మొలకలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మొలకలను ఆహారంలో భాగంగా స్థిరంగా తీసుకోవడం వల్ల శరీరం లోపలి నుండి ఆరోగ్యంగా, బలంగా తయారవుతుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇక.. పరిమితిగా తీసుకోవటం ద్వారా ఎలాంటి దుష్ఫలితాలు ఉండవని చెబుతున్నారు.

# పచ్చి బఠాణీ టమాటా కర్రీ.. నిమిషాల్లోనే రెడీ..!

పచ్చి బఠాణీలతో టమాటా కర్రీ సూపర్ టేస్టీగా ఉంటుంది. సాధారణంగానే టమాటా కర్రీ అద్భుతంగా ఉంటుంది. ఇక ఆ మిశ్రమంలో పచ్చి బఠాణీ వేసి చేస్తే టేస్ట్ నెక్స్ట్ లెవెల్ ఉంటుంది. ఈ పచ్చి బఠాణీ టమాటో కర్రీని పెద్దలు, పిల్లలు ఇష్టంగా తింటారు. ఈ కర్రీ అన్నం, చపాతీ, రోటీల్లోకి బాగుంటుంది. అలాగే తక్కువ పదార్థాలతో తక్కువ సమయంలో ఈ కర్రీని ఈజీగా తయారు చేసుకోవచ్చు. మరి ఈ కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు, తయారీ విధానం ఇక్కడ తెలుసుకోండి.. పచ్చి బఠాణీ టమాటో కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. పచ్చి బఠాణీలు ఒక కప్పు, టమాటోలు అర కిలో, ఉల్లిపాయలు రెండు, పచ్చిమిర్చి నాలుగు, వెల్లుల్లి రెబ్బలు 20, నూనె తగినంత, మెంతులు తగినన్ని, జీలకర్ర ఒక టేబుల్ స్పూన్, ఆవాలు ఒక టేబుల్ స్పూన్, పసుపు చిటికెడు, ఉప్పు తగినంత, కారం రుచికి సరిపడా, ధనియాల పొడి ఒక టేబుల్ స్పూన్, కొత్తిమీర తరుగు, కరివేపాకు కొద్దిగా తీసుకోవాలి. పచ్చి బఠాణీ టమాటా కర్రీ తయారీ విధానం చూస్తే.. ముందుగా టమాటోలను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పచ్చి బఠాణీలను ఒలిచి పక్కన పెట్టుకోవాలి. ఉల్లిపాయలను సన్నగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో నూనె పోసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత అందులో మెంతులు, జీలకర్ర, ఆవాసి వేసి వేయించుకోవాలి. అందులో వెల్లుల్లి, పచ్చిమిర్చి వేసి ఫ్రై చేసుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించుకోవాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో పచ్చి బఠాణీలు ఫ్రై చేయాలి. అందులో ఇప్పుడు టమాటా ముక్కలను వేసి బాగా కలపి మగ్గించుకోవాలి. ఇప్పుడు అందులో ఉప్పు, కారం వేసి ఉడికించుకోవాలి. అలా బఠాణీ మెత్తగా ఉడికేంత వరకూ కుకింగ్ చేసుకోవాలి. చివరగా ధనియాల పొడి, కొత్తిమీర తరుగు వేయాలి. అంతే సూపర్ టేస్టీ పచ్చి బఠాణీ టమాటా కర్రీ రెడీ అయినట్టే..



# బ్రౌన్ రైస్, రెడ్ రైస్- ఆరోగ్యానికి ఏది మంచిది..!?



ప్రస్తుతం తెల్ల అన్నం వినియోగం తగ్గింది. ఈ స్థానంలో చాలా మంది బ్రౌన్ రైస్ తింటున్నారు. బ్రౌన్ రైస్‌ను రోజూ తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. బ్రౌన రైస్ తో పాటుగా రెడ్ రైస్ కూడా వినియోగంలోకి వచ్చింది. ఈ రైస్ కూడా ఆరోగ్య పరంగా అనేక లాభాలను అందిస్తుంది. బ్రౌన్ రైస్‌తో పోలిస్తే రెడ్ రైస్ లోనూ అనేక పోషకాలు ఉంటాయి. అయితే ఈ రెండింటిలో దేన్ని తినాలి.. ఎవరికి ఏ రైస్ మంచిది అనే సందేహం చాలా మందిలో ఉంది. ఈ రెండు రైస్ లో ఎందులో ఎక్కువ పోషకాలు ఉంటాయి..ఎవరికి ఏది మంచిదో నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. బ్రౌన్ రైస్, రెడ్ రైస్ రెండింటిలోనూ ఫైబర్ ఉంటుంది. కానీ రెడ్ రైస్‌లో ఇది కాస్త ఎక్కువ మోతా దులో ఉంటుంది. అలాగే గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ బ్రౌన్ రైస్ కన్నా రెడ్ రైస్‌కే తక్కువగా ఉంటుంది. కనుక షుగర్ ఉన్నవారికి బ్రౌన్ రైస్ కన్నా రెడ్ రైస్ ఎక్కువ మేలు చేస్తుంది. కాబట్టి ఈ విషయంలోనూ రెడ్ రైస్ కు ప్రాధాన్యత ఇస్తారు. బ్రౌన్ రైస్‌తో పోలిస్తే రెడ్ రైస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇక ఈ రెండింటిలోనూ మెగ్నీషియం, ఫాస్ఫరస్ సమానంగానే ఉంటాయి. కానీ ఐరన్, జింక్ వంటి పోషకాలు మాత్రం రెడ్ రైస్‌లోనే అధికంగా ఉంటాయి. కనుక ఈ రెండు రకాల రైస్‌లలోనూ రెడ్ రైస్‌ను క్లియర్ విన్నర్ అని చెప్పవచ్చు. పోషకాల విషయానికి వస్తే రెడ్ రైస్‌లోనే అధికంగా ఉంటాయి. కాబట్టి బ్రౌన్ రైస్‌ను తింటున్నవారు ఈ రైస్‌ను తింటే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది. ఈ రైస్‌ను తింటే శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా రక్త నాళాల వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రెడ్ రైస్‌ను తినడం వల్ల అధిక మొత్తంలో ఐరన్‌ను పొందవచ్చు. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది ఇక రెడ్ రైస్‌ను తింటే మెగ్నీషియం అధికంగా లభిస్తుంది. ఇది రక్త నాళాలను వెడల్పు చేస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీని వల్ల బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ రైస్ ఎంతో మేలు చేస్తుంది. అలాగే గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుందిఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ రైస్‌లోని మెగ్నీషియం కండరాల నొప్పులను తగ్గిస్తుంది. దీని వల్ల రాత్రి పూట నిద్రలో కాలి పిక్క లు పట్టుకుపోవడం కూడా తగ్గుతుంది. రెడ్ రైస్‌ను తింటుంటే షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఈ రైస్‌లో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా రెడ్ రైస్ వల్ల మనకు అనేక లాభాలు ఉంటాయి. కనుక బ్రౌన్ రైస్ తింటున్నవారు ఈ రైస్‌ను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోండి. దీని వల్ల అనేక లాభాలను పొందవచ్చు. తెల్ల అన్నం తగ్గించి బ్రౌన్ రైస్ తీసుకుంటున్న వారు తరచూ ఈ తరహా రెడ్ రైస్ తీసుకోవటం ద్వారా ఆరోగ్య కరంగా ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు.

# పాలకూరతో నయా స్టైల్ రెసిపీ.. ఇలా చేస్తే టేస్ట్ నెక్స్ట్ లెవెల్..!



పాలకూర ఆరోగ్యానికి చాలా మంచిది. పాలకూరలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. చాలామంది పాలకూరతో పప్పు, పచ్చడి, ఫ్రై వంటివి చేసుకుని తింటారు. ఇంకొంతమంది టమాటోతో కలిపి పాలకూరను వండుకుంటారు. అయితే టమాటోలు వేయకుండానే టేస్టీగా తయారు చేసుకునే రెసిపీ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఇలా ఉల్లికారంతో పాలకూర కర్రీ ఎంతో రుచికరంగా ఉంటుంది. మరి ఈ నయా పాలకూర రెసిపీని ఎలా తయారు చేయాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? నయా పాలకూర తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. పాలకూర తరుగు 120 నుంచి 150 గ్రాములు, నూనె తగినంత, పోప్ దినుసులు ఒక టేబుల్ స్పూన్, కొత్తిమీర తరుగు కొద్దిగా, ఉల్లికారం తయారీకి ఉల్లిపాయలు రెండు, వెల్లుల్లి రెబ్బలు ఐదారు, చింతపండు కొద్దిగా , పసుపు చిటికెడు, ఉప్పు, కారం రుచికి తగినంత, ధనియాల పొడి అర టీ స్పూన్, జీలకర్ర పొడి కొద్దిగా, ఇంగువ చిటికెడు తీసుకోవాలి. పాలకూర తయారీ విధానం చూస్తే.. ముందుగా పాలకూరను శుభ్రంగా కడగాలి. ఆ తర్వాత పాలకూరను కట్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. అలాగే ఉల్లిపాయలను మీడియం సైజులో కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద గిన్నె పెట్టుకుని నూనె పోసి వేడి చేయాలి. నూనె వేడెక్కిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పొట్టు తీసిన వెల్లుల్లి వేసుకోవాలి. అలా ఉల్లిపాయలు మగ్గిన తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి మరిన్ని కనుగొనండి పచ్చడి వెల్లుల్లి కర్రీ కూర మొబైల్ వార్తలు సేవ రాజకీయ విశ్లేషణ కోర్సులు క్రీడలు ఇప్పుడు ఉల్లిపాయ మిశ్రమాన్ని మిక్సీలో వేయాలి. అందులోనే నానబెట్టిన చింతపండు, పసుపు, ఉప్పు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి గిన్నె పెట్టుకుని ఆయిల్ వేసి వేడి చేసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత అందులో పోపు దినుసులు, ఎండు మిర్చి వేసి వేయించాలి. ఇప్పుడు ఇంగువ, కరివేపాకు వేసి ఆ తర్వాత పాలకూర తరుగు వేసి మగ్గించుకోవాలి. ఇప్పుడు అందులో ఉల్లిపాయ పేస్ట్ మిశ్రమాన్ని వేయాలి. ఖనీలివతీవట ఃఎ ఆ తర్వాత మూత పెట్టి మధ్య మధ్యలో కలుపుతూ ఆయిల్ సెపరేట్ అయ్యేంత వరకూ మగ్గించుకోవాలి. చివరగా కొత్తిమీర తరుగు చల్లి దింపితే సరి.. సూపర్ టేస్టీ పాలకూర కర్రీ రెడీ అయినట్టే..

# అమ్మమ్మల స్పెషల్ రెసిపీ “పచ్చిమిర్చి పచ్చడి” ట్రై చేస్తారా..

తెలుగువారి భోజనంలో “పచ్చిమిర్చి పచ్చడి”కి ఉండే స్థానమే వేరు. పచ్చిమిర్చి కేవలం కారం కోసమే కాదు, ఇందులో ఆరోగ్య రహస్యాలు కూడా ఉన్నాయి. ఇందులో విటమిన్ అ పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అలానే పచ్చిమిర్చిలోని ‘క్యాప్సైసిన్’ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని కొవ్వును కరిగించడానికి కూడా సహాయపడుతుంది. ఏ కూర లేకపోయినా, ఇంట్లో పచ్చిమిర్చి ఉంటే చాలు ఐదు నిమిషాల్లో కమ్మని పచ్చడి సిద్ధం చేసుకోవచ్చు. వేడివేడి అన్నంలో కొంచెం నెయ్యి, పక్కన ఈ పచ్చడి ఉంటే చాలు.. ఆ రుచిని మాటల్లో వర్ణించలేము. ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో పచ్చిమిర్చి పచ్చడిని రకరకాలుగా చేస్తారు. వాటిలో.. రోటి పచ్చడి: రోట్లో దంచిన పచ్చడికి ఉండే రుచి మిక్సీలో రాదు. పచ్చిమిర్చిని వేయించి, చింతపండు, వెల్లుల్లి, ఉప్పు వేసి దంచితే ఆ వాసనే వేరు. మిర్చిని నూనెలో దోరగా వేయించి చేయడం వల్ల కారం కొంచెం తగ్గి, రుచి పెరుగుతుంది. పెరుగు పచ్చిమిర్చి పచ్చడి: దీనిని ‘పచ్చిమిర్చి మెంతి పచ్చడి’ అని కూడా అంటారు. ఇది పెరుగు అన్నంలోకి అద్భుతంగా ఉంటుంది. పల్లెటూరి వాతావరణంలో అయితే చద్దన్నంలోకి పచ్చిమిర్చి పచ్చడి నంజుకుని తినడం ఒక అద్భుతమైన అనుభూతి. పచ్చిమిర్చి పచ్చడి తయారీ విధానం.. కావలసిన పదార్థాలు: పచ్చిమిర్చి: 100 గ్రాములు (కారానికి తగినట్లు) చింతపండు: నిమ్మకాయ సైజులో సగం వెల్లుల్లి రెబ్బలు: 5-6 జీలకర్ర: 1 టీస్పూన్ ధనియాలు: 1 టీస్పూన్ నూనె: 2 టేబుల్ స్పూన్లు ఉప్పు: రుచికి తగినంత ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ. తయారీ విధానం.. స్టవ్ మీద బాణలి పెట్టి ఒక స్పూన్ నూనె వేయండి. అందులో ధనియాలు, జీలకర్ర వేసి వేయించి పక్కన పెట్టుకోండి. అదే బాణలిలో పచ్చిమిర్చిని (మధ్యలోకి తుంపి) వేసి మూత పెట్టి మగ్గనివ్వండి. పచ్చిమిర్చి తెల్లగా అయ్యే వరకు వేయించి చల్లారనివ్వండి. మిక్సీ జార్‌లో లేదా రోట్లో ముందుగా వేయించిన ధనియాలు, జీలకర్ర, వెల్లుల్లి, ఉప్పు వేసి మెత్తగా చేయండి. ఆ తర్వాత వేయించిన పచ్చిమిర్చి, నానబెట్టిన చింతపండు వేసి కచ్చాపచ్చాగా రుబ్బండి (మరీ మెత్తగా చేయవద్దు). బాణలిలో నూనె వేసి వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, చిటికెడు పసుపు, ఇంగువ వేసి పోపు పెట్టండి. ఈ పోపును సిద్ధం చేసుకున్న పచ్చడిలో కలిపేయండి. చిట్కాలు.. ఈ పచ్చడిలో కొద్దిగా వేయించిన నువ్వులు లేదా పల్లీలు కలిపితే కారం తగ్గి రుచి పెరుగుతుంది. వేడివేడి అన్నంలో నెయ్యి వేసుకుని తింటే చాలా అద్భుతంగా ఉంటుంది



# స్పోర్ట్స్ న్యూస్

## రెండు ట్రోఫీలు అందించినా గుర్తింపు లేదు.. క్లార్క్ సంచలన వ్యాఖ్యలు

ప్రస్తుతం రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు పేరు మార్మోగుతోంది. అందుకు కారణం.. వరుసగా రెండు సార్లు ఐపీఎల్ టైటిళ్లను గెలవడం. 17 ఏళ్ల పాటు ఐపీఎల్ ట్రోఫీని అందుకునేందుకు ఆర్సీబీ ఎంతో కష్టపడింది. ఐపీఎల్ ప్రారంభమైన ప్రతిసారి.. కప్ ఆర్సీబీదే అంటూ వారి అభిమానులు స్లోగన్స్ ఇవ్వడం..చివరకు నిరాశ ఎదురుకావడం జరిగేది.



అయితే వారి కలలను నిజం చేస్తూ.. గతేడాది ఆర్సీబీ ఐపీఎల్ విజేతగా అవతరించింది. ఇదే సంతోషం అనుకుంటే.. ఆర్సీబీ వరుసగా రెండోసారి ఈ ఏడాది కూడా ట్రోఫీని గెలిచి.. అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది. ఇదే సమయంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ రెండు ఐపీఎల్ టైటిళ్లు అందించినా తగిన గుర్తింపు దక్కలేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.తాజాగా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ జట్టులో ఉండటంతో రజత్ పాటిదార్ గురించి ఎవరూ మాట్లాడటం లేదని తెలిపాడు. మైఖేల్ క్లార్క్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రజత్ పాటిదార్ మరోసారి సత్తా చాటాడు. అతను స్టార్ క్రికెటర్ కాకపోవడం.. కోహ్లీ జట్టులో ఉండటంతో పాటిదార్ గురించి ఎవరూ మాట్లాడటం లేదు. కానీ కెప్టెన్‌గా అతడు ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టాడు. అతను వ్యక్తిగతంగా కూడా మంచి ప్రదర్శన ఇచ్చాడు. భారత టీ20 జట్టులో చోటు దక్కేలా అతని గురించి చర్చ జరగాలి' అని మైఖేల్ క్లార్క్ పేర్కొన్నాడు.'రజత్ పాటిదార్ టీమిండియాకు కెప్టెన్ అవుతాడో లేదో నాకు తెలీదు. కానీ, అతడిలో సారథ్యలో లక్షణాలున్నాయి. మిడిలార్డర్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తాడు. టీ20ల్లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదు. ఈ ఐపీఎల్‌లో రాణించిన చాలా మంది ఆటగాళ్లు టీమిండియాలో స్థానం కోసం పోటీ పడుతున్నారు. కానీ రజత్ పాటిదార్‌ను సెలెక్టర్లు తప్పకుండా దృష్టిలో ఉంచుకుంటారని నేను అనుకుంటున్నాను. టీ20ల్లో పాటీదార్ పేరు ముందుండాలి' అని క్లార్క్ సూచించాడు.

## టెస్ట్ క్రికెట్ కోసం ఐపీఎల్ తరహా ప్రణాళికను అందించిన లలిత్ మోదీ



టీ20 ఫార్మాట్ వచ్చిన తర్వాత క్రికెట్‌లో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. అనేక దేశవాళీ టీ20 లీగ్స్ పట్టుకొచ్చాయి. క్రికెట్ ప్రియులు సైతం ఈ ఫార్మాట్ మ్యాచలను చూసేందుకే ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో వన్డే మ్యాచులకు కాస్త ప్రభావం తగ్గిందని క్రీడా నిపుణలు చెబుతున్నారు. ఇక టెస్టు క్రికెట్ అయితే ఆదరణ కోల్పోయి.. ప్రమాదకర స్థితిలో ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈ క్రమంలో టెస్టు క్రికెట్‌ను బతికించేందుకు ఐపీఎల్ తరహాలో ఓ ప్రణాళికను ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ అందించాడు.ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను తిరిగి ఆకర్షించడానికి వాణిజ్యపరమైన చర్యలు ప్రవేశపెట్టకపోతే, సాంప్రదాయ, ద్వైపాక్షిక రెడ్ బాల్ సిరీస్‌లు పూర్తిగా అంతరించిపోతాయని లలిత్ మోదీ హెచ్చరించాడు. లండన్‌లో ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఫ్రాంచైజీ ఆధారిత నమూనాలు ఇకపై కేవలం ఒక ప్రత్యామ్నాయాలు మాత్రమే కాదని, టెస్ట్ క్రికెట్ వారసత్వాన్ని నిలబెట్టడానికి అవసరమైన జీవనాధారాలని తెలిపాడు.క్రికెట్ నిర్వహాకులు ఐపీఎల్ తరహా టెస్ట్ మ్యాచ్‌లకు అనుమతి ఇవ్వాలని, వారు చేయవలసిన తదుపరి పని టెస్ట్ మ్యాచ్‌లను తిరిగి తీసుకురావడమేనని పేర్కొన్నాడు. వన్ డే (రాఆఎ) అంతం కావాలని, అలానే క్రికెట్ ప్రపంచంలో టెస్టులు కొనసాగడం చాలా ముఖ్యమని లలిత్ మోదీ నొక్కి చెప్పాడు. రెడ్ బాల్ క్రికెట్ ఆర్థికంగా టీ20 ఫార్మట్ లీగ్‌లతో పోటీపడలేదని లలిత్ మోదీ అంగీకరించాడు. అయితే టెస్టు క్రికెట్ నిలదొక్కుకోవడం అనేది ప్రభుత్వ బోర్డుల కంటే ఫ్రాంచైజీ కార్పొరేట్ మద్దతుపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నాడు.క్లబ్ క్రికెట్ చర్యలు తీసుకోకపోతే టెస్ట్ క్రికెట్ అంతరించిపోతుందని, ఇది నష్టాల వ్యాపారంగా మిగిలిపోతుందని అన్నాడు. ప్రతీదీ డబ్బు సంపాదించాలని తాను అనడం లేదు... ప్రతీదానిలో లాభం ఉండాల్సిన అవసరం లేదని, ఆట కోసం కూడా మనం ఏదైనా చేయాలని లలిత్ మోదీ వెల్లడించాడు. ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా ఐదు రోజుల టెస్టులను నాలుగు రోజుల, అలానే డే అండ్ నైట్ మ్యాచ్‌లుగా మార్చాలని లలిత్ మోదీ ప్రతిపాదించాడు. ఫ్రాంచైజీ లీగ్‌లు, ఐసీసీ ఈవెంట్ల వల్ల టెస్ట్ క్రికెట్ ఆదరణ కోల్పోతున్న తరుణంలో ఆయన ఈ హెచ్చరిక చేశాడు.

## సూర్యకుమార్‌కు బిగ్ షాక్.. టీమిండియాకు కొత్త కెప్టెన్!

టీ20 ప్రపంచ కప్ 2024 ట్రోఫీని టీమిండియాకు అందించిన కెప్టెన్ సూర్య కుమార్‌కు బిగ్ షాక్ తగలనున్నట్లు సమాచారం. జూన్, జులైలో జరగనున్న ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల కంటే ముందే సూర్యను కెప్టెన్సీ నుంచి తప్పించాలని బీసీసీఐ నిర్ణయించినట్లు తెలుస్తోంది. చాలాకాలం నుంచి ఈ ముంబై స్టార్ ఫామ్ లేమితో సతమతం అవుతున్నాడు. ఒకప్పుడు టీ20 ప్రపంచ నంబర్ వన్‌గా కొనసాగిన ఈ మిస్టర్ 360.. ఇప్పుడు హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకోవాడానికి కూడా తీవ్రంగా శ్రమిస్తున్నాడు.ఇటీవల ముగిసిన ఐపీఎల్-2026లోనూ అతడి ప్రదర్శన దారుణంగా ఉంది. ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్న సూర్య.. 13 ఇన్నింగ్స్‌లలో 270 పరుగులు మాత్రమే చేశాడు.



2017 తర్వాత సూర్యకుమార్‌కు అత్యంత పేలవమైన ఐపీఎల్ సీజన్ ఇదే కావడం గమన్హారం. ఈ క్రమంలోనే అతడి స్థానంలో కొత్త కెప్టెన్‌ను నియమించాలని బోర్డు భావిస్తోంది. కెప్టెన్‌గానే కాకుండా ఏకంగా అతడిని జట్టు నుంచి తప్పించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌లతో బీసీసీఐ చర్చలు జరిపినట్లు సమాచారం. కొత్త సారథి ఎంపిక ప్రక్రియ ప్రారంభించమని వారికి బీసీసీఐ చెప్పినట్లు తెలుస్తోంది. త్వరలోనే కొత్త సారథి పేరును అధికారికంగా ప్రకటించనుంది.'ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో సెలక్షన్ కమిటీ, బీసీసీఐ, టీమ్ మేనేజ్‌మెంట్ చర్చించి.. భవిష్యత్తులో జరిగే టీ20 మ్యాచుల్లో భారత జట్టు కొత్త కెప్టెన్‌తో ముందుకు వెళ్లాలని నిర్ణయించాయి. సూర్య కెప్టెన్సీలో భారత్ టీ20 ప్రపంచకప్ గెలిచినప్పటికీ, అతడి ఫామ్ దృష్టిలో ఉంచుకుని బోర్డు కొత్త కెప్టెన్‌ను ఎంపికకు సిద్ధమైంది. ఈ విషయాన్ని త్వరలోనే అతనికి స్పష్టం చేస్తాం" అని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు మీడియాతో పేర్కొన్నారు. కాగా కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లతో పాటు హైదరాబాదీ తిలక్ వర్మ పేరు కూడా బలంగా వినిపిస్తోంది.

## నెంబర్ వన్ చేతిలో మళ్లీ ఓడిన పీవీ సింధు..

### ఇండోనేషియా ఓపెన్ నుంచి ఔట్



జకార్తా: ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధ ఇండోనేషియన్ ఓపెన్‌లో ఇవాళ ఓటమి పాలైంది. వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ ఆన్ సే యంగ్ చేతిలో ఆమ పరాజయాన్ని చూవిచూసింది. 17-21, 14-21 స్కోరుతో దక్షిణ కొరియా క్రీడాకారిణి విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇటీవల వరుసగా రెండోసారి ఆన్ సే యంగ్ చేతిలో పీవీ సింధు ఓడింది. గత వారం సింగపూర్ ఓపెన్ క్వార్టర్స్‌లోనూ సింధు ఓటమి పాలైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆన్ సే యంగ్, సింధు మధ్య 10 మ్యాచ్‌లు జరిగాయి. అన్నింటిలోనూ సింధు ఓడింది. ఇప్పటి వరకు ఆన్‌పై సింధు విక్టరీ నమోదు చేయకపోవడం గమనార్హం.ఇవాళ జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో తొలి గేమ్ ఆసక్తికరంగా సాగింది. ఓ దశలో ఇద్దరూ 10-10 స్కోరుతో సమంగా నిలిచారు. కొరియన్ ప్లేయర్‌ను కాసేపు వత్తిడిలో పెట్టింది సింధు. ఆ తర్వాత 15-14 లీడ్ సాధించింది. కానీ ఆన్ దూకుడు ఆటతో సింధు వెనుకబడింది. తొలి గేమ్ చివరలో 41 షాట్ల ర్యాలీ ఆడారు. ఆ తర్వాత ఓపెనింగ్ గేమ్‌ను కొరియన్ క్రీడాకారిణి సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లోనూ ఆన్ ఈజీగా విజయాన్ని నమోదు చేసింది.

## నేనేమీ పారిపోవడం లేదు: లలిత్ మోడీ

న్యూఢిల్లీ: ఐపీఎల్ మాజీ చైర్మెన్ లలిత్ మోదీతాజాగా ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎవరి నుంచీ తానేమీ పారిపోవడం లేదన్నారు. ఎటువంటి నేరం తనపై రుజువు కాలేదన్నారు. భారతీయ అధికారుల నుంచి విజయవంతంగా దాక్కుంటున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. అది కేవలం మీడియా తన సెన్షేషన్ కోసం చేస్తున్న ప్రచారం మాత్రమే అన్నారు. న్యాయపరంగా తాను అందరికీ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఎక్కడికీ పారిపోవడం లేదన లలిత్ మోదీ.. గ్లోబల్ సూపర్‌పవర్ ఇండియా నుంచి తప్పించుకోవడం అసాధ్యమైన అంశమన్నారు. ఒకవేళ నిజంగా నేను పారిపోతుంటే, అప్పుడు భారత్ నన్ను పట్టుకోవడం కష్టమైన పనేకాదని, భారతీయ ప్రభుత్వానికి చాలా సత్తా ఉందని, భారత ప్రభుత్వంతో పెట్టుకోలేమని, నాకు ఆ ఉద్దేశం కూడా లేదని, ప్రభుత్వం కాదు, కానీ మీడియానే అతి చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు.మీడియా అంశంలో కఠినమైన పరువునష్టం చట్టాలు లేకపోవడం సమస్యగా మారిందన్నారు. ఇండియాలో మీడియాపై కేసులు లేవని, దాని వల్లే ఇష్టం వచ్చినట్లు వార్తలు ఇస్తున్నారని ఆరోపించారు. మనీల్యాండరింగ్, ఫెమా చట్టాల ఉల్లంఘన కేసులను మోడీ ఎదుర్కొంటున్నారు. కానీ తనపై ఇప్పటి వరకు ఎటువంటి నేరపూరిత ఆరోపణలు రుజువు కాలేదన్నారు. భారతీయ న్యాయ వ్యవస్థను లలిత్ మోడీ తప్పుపట్టారు. భారత్‌లో న్యాయం ఆలస్యంగా దక్కుతుందని, నెమ్మదిగా న్యాయం అందడం అంటే, అదో పెద్ద శిక్ష అన్నారు.ఇప్పటి వరకు తనపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. ఒకవేళ నిజంగా తాను చెడ్డవాడినే అయితే, అప్పుడు మీరు న్యాయం ప్రకారం ప్రాసిక్యూట్ చేయవచ్చు అన్నారు. ఇక ఇప్పుడు ఇండియాకు తిరిగి రావాలన్న ఆలోచన లేదన్నారు. మీరు నన్ను అరెస్టు చేయాలనుకుంటున్నారా.. 17 ఏళ్ల నుంచి మీరు నన్ను కోర్టుకు తీసుకెళ్లలేదు, మీరెలా నన్ను అరెస్టు చేయగలదరు, ఒకవేళ ఏదైనా ఉంటే, అదే జరుగుతుందని లలిత్ మోడీ అన్నారు.ఐపీఎల్ చైర్మెన్‌గా లలిత్ మోడీ ఉన్న సమయంలో జరిగిన ఆర్థిక అక్రమాలపై ఈడీ విచారణ చేపడుతున్న విషయం తెలిసిందే.



## ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం

ముంబై: ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం కానున్నాడు. అతను తొడకండరాల నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ టోర్నీలో.. ఆర్సీబీ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే జూన్ 13వ తేదీ నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు కోహ్లీని ఎంపిక చేయడం లేదని తెలిసింది. తొడకండరాల నొప్పి వల్ల అతను వన్డే సిరీస్ ఆడకపోవచ్చు అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.37 ఏళ్ల కోహ్లీ.. ఈ యేటి ఐపీఎల్‌లో 675 రన్స్ చేసి తన ఫిట్‌నెస్ చాటుకున్నాడు. ఈ సీజన్‌లో అతను ఓ సెంచరీ, అయిదు హాఫ్ సెంచరీలు కొట్టాడు. అయితే ఆఫ్ఘన్‌తో సిరీస్‌కు అతను అందుబాటులో లేకపోవడం భారత జట్టుకు లోటే అవుతుంది. ఫిట్‌నెస్‌లో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న అతను వన్డే సిరీస్ మిస్ కావడం చాలా అరుదైన అంశం. అయితే రోహిత్ శర్మ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉంటాడో లేదో ఇంకా తెలియదు. ఐపీఎల్‌లో రోహిత్‌కు కూడా తొడకండరాలు పట్టేసిన విషయం తెలిసిందే. అయినా అతన్ని భారత జట్టుకు తీసుకున్నారు.టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న కోహ్లీ, రోహిత్‌లు.. వన్డేలపై దృష్టి పెట్టారు. అయితే వచ్చే ఏడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌లో ఆ ఇద్దరూ ఆడుతారేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక ఆఫ్ఘనిస్తాన్‌తో లక్నోలో 17న రెండో వన్డే, చెన్నైలో 20న మూడో వన్డే జరగనున్నది.




## శ్రీలంక చేతిలో వెస్టిండీస్ ఘోర ఓటమి

వెస్టిండీస్ పర్యటనను శ్రీలంక జట్టు విజయంతో ప్రారంభించింది. కింగ్‌స్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో కరేబియన్ జట్టుపై 41 పరుగుల తేడాతో శ్రీలంక విజయం సాధించింది. దీంతో లంక జట్టు మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. శ్రీలంక విజయంలో కుశాల్ మెండిస్ కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన శ్రీలంక తొలుత బ్యాటింగ్‌కు దిగింది.లంకేయులు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 303 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓపెనర్ పాతుమ్ నిశాంక(103 బంతుల్లో 79 పరుగులు), కుశాల్ మెండిస్ (62 బంతుల్లో 72 పరుగులు) హాఫ్ సెంచరీలతో సత్తాచాటారు. చరిత్ అసలంక(45), జనిత్ లియాంగే(44) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. కరేబియన్ బౌలర్లలో జైడన్ సీల్స్, మాథ్యూ ఫోర్డ్, రోస్టన్ ఛేజ్ తలా రెండు వికెట్లు సాధించారు.అనంతరం 304 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్.. 49.2 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షైహోప్ (56) , గ్రీవ్స్(45) రాణించగా, మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. లంక పేసర్ దుష్మంత చమీరా 4 వికెట్లతో విండీస్ పతనాన్ని శాసించాడు. తీక్షణ రెండు, హసరంగ, చరిత్ అసలంక తలో వికెట్ సాధించారు. కుశాల్ మెండిస్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది. రెండో వన్డే ఇదే వేదికలో జూన్ 7న జరగనుంది.

# సినిమా

## ‘పెద్ది’ మూవీ రివ్యూ




నటీనటులు: రామ్ చరణ్– జాన్వి కపూర్– శివరాజ్ కుమార్– జగపతిబాబు– దివ్యేందు– రావు రమేష్– సత్య– రవికిషన్– ఉపేంద్ర లిమాయే– బొమన్ ఇరానీ– శ్రీకాంత్ అయ్యంగార్– టిను ఆనంద్ తదితరులు సంగీతం: ఏఆర్ రెహమాన్ ఛాయాగ్రహణం: రత్నవేలు నిర్మాతలు: సతీష్ కిలారు– ఇషాన్ సక్సేనా రచన–దర్శకత్వం: బుచ్చిబాబు సానా సంక్రాంతి తర్వాత వెలవెలబోయిన టాలీవుడ్ బాక్సాఫీస్ ను గట్టెక్కించే సినిమా అవుతుందని ఇండస్ట్రీ అంతా ఆశలు పెట్టుకున్న చిత్రం.. పెద్ది. తన అరంగేట్ర చిత్రం ‘ఉప్పెన’తోనే సెన్సేషన్ క్రియేట్ చేసిన బుచ్చిబాబు దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన చిత్రమిది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం.. ఆ అంచనాలను ఎంతమేర అందుకుందో చూద్దాం పదండి. కథ: పెద్ది (రామ్ చరణ్) విజయనగరం జిల్లాలోని ఒక కొండ ప్రాంతంలోని ఒక ఊరికి చెందిన కుర్రాడు. ఈ ఊరికే పేరే కాదు.. ఏ రకమైన గుర్తింపూ ఉండదు. ఊరిలో అందరూ కూలీలే. కానీ వేరే ఊళ్లతో పోలిస్తే ఆ ఊరి వాళ్లకు మాత్రం సగం కూలే ఇస్తారు. వాళ్లంటే అందరికీ అంత చిన్నచూపు. ఏ రవాణా సౌకర్యం లేని ఆ ఊరిని బాగు చేయడం కోసం అప్పల సూరి (జగపతిబాబు) దశాబ్దాల తరబడి ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో క్రికెట్లో గొప్ప నైపుణ్యం సంపాదించిన పెద్ది వల్ల ఆ ఊరికి కొంచెం పేరొస్తుంది. కానీ డబ్బుల కోసమే క్రికెట్ ఆడే పెద్ది.. తనకు జరిగిన ఒక అవమానం వల్ల ఆ ఆటనే వదిలేసి కుస్తీ వైపు అడుగులేస్తాడు. అతను ఆట మారడానికి దారి తీసిన పరిస్థితులేంటి.. అప్పలసూరి పోరాటం ఎంత వరకు వచ్చింది.. కుస్తీలోకి వచ్చిన పెద్ది ఏం సాధించాడు.. తన ప్రయాణం ఎలాంటి మలుపులు తిరిగింది.. చివరికి పెద్ది తన ఊరి రాతను మార్చగలిగాడా లేదా అన్నది మిగతా కథ. కథనం–విశ్లేషణ: “ఆటే నా గుర్తింపు సారు”.. అంటూ ‘పెద్ది’ ట్రైలర్లో ఒక డైలాగ్ విని ఉంటారు. మరి ఆట ద్వారా తనకొచ్చి గుర్తింపును.. కనీసం ఒక పేరుకు కూడా నోచుకోకుండా మరుగున పడిపోయిన తన ఊరి కోసం ఒక మల్టీ టాలెంటెడ్ ప్లేయర్ ఎలా ఉపయోగించాడన్నదే ‘పెద్ది’ సినిమా కథ. ఆటగాళ్ల కంటే ఆట గొప్పది అని ఒక మాట వింటుంటాం. కానీ ‘పెద్ది’ సినిమా చూస్తున్నపుడు మాత్రం దీనికి విరుద్ధమైన అభిప్రాయం కలుగుతుంది. ఆటగాడే ఆటను మించి.. కాదు కాదు, ‘ఆటలను’ మించి కనిపిస్తాడు. ‘పెద్ది’కి ఇదే బలం, ఒక రకంగా బలహీనత కూడా. ‘పెద్ది’లో చూపించిన మూడు ఆటల్లో కుస్తీ ఇచ్చినంత కిక్కు మిగతావి ఇవ్వలేకపోయాయి. కానీ మార్చి మార్చి మూడు ఆటలు ఆడే ‘క్రాస్ ఓవర్’ అథ్లెట్ మాత్రం తెగ నచ్చేస్తాడు. రామ్ చరణ్ కెరీర్లో పెర్ఫామెన్స్ పరంగా ‘ది బెస్ట్’ అనదగ్గ ‘రంగస్థలం’తో సరితూగే స్థాయిలో అతను పతాక స్థాయిలో విజృంభించాడు. తన పెర్ఫామెన్స్ ఉన్నంత అత్యున్నత స్థాయిలో సినిమా లేదు కానీ.. మూడు గంటల పాటు ప్రేక్షకులను కుదురుగా కూర్చోబెట్టడంలో మాత్రం ‘పెద్ది’ విజయవంతమైంది. ‘పెద్ది’ కథను రాతల్లో చూస్తే చాలా గొప్పగా అనిపిస్తుంది. కానీ దృశ్య రూపంలో కొంచెం స్థాయి తగ్గిందనిపిస్తుంది. ఒక సూపర్ స్టార్ హీరో సినిమా నుంచి అభిమానులు, మాస్ ప్రేక్షకులు ఆశించే కమర్షియల్ అంశాలను కూడా ఈ కథలో జొప్పించి బ్యాలెన్స్ చేయడానికి బుచ్చిబాబు చేసిన ప్రయత్నం వల్ల ‘పెద్ది’ కొంచెం మిశ్రమానుభూతిని కలిగిస్తుంది. ముఖ్యంగా జాన్వి కపూర్ చేసిన అల్ట్రా గ్లామరస్ అచ్చియమ్మ పాత్ర.. దయనీయమైన పరిస్థితుల్లో సాగే హీరో ప్రయాణంలో ఏమాత్రం కుదరలేదు. అసలు మనం చూస్తున్న కథేంటి.. ఇందులో ఈ పాత్రేంటి అనిపించేలా పూర్తిగా నాన్ సింక్ లో నడుస్తుంది ఆ పాత్ర.. తన అప్పీయరెన్స్. ఒక పెద్ద హీరో పక్కన హీరోయిన్ ఉండాలి.. ఆ పాత్రను గ్లామరస్ గానే ప్రెజెంట్ చేయాలనే రొటీన్ ఆలోచనల్లోంచి పుట్టిన పాత్రలా అనిపిస్తుందిది. సినిమాలో ఒక సన్నివేశంలో హీరోయిన్ని వివస్త్రను చేసి అవమానించడానికి ప్రయత్నిస్తుంది విలన్ గ్యాంగ్. కానీ అప్పటిదాకా కథానాయిక చేసిన అంగాంగ ప్రదర్శన వల్ల.. విలన్ గ్యాంగ్ ఇంత చేసినా ఆ పాత్ర మీద సానుభూతి కలగని పరిస్థితి. కుర్రకారును మెప్పించే ప్రయత్నంలో హీరోయిన్ పాత్రను ప్రెజెంట్ చేసిన విధానం వల్ల వచ్చిన ఇబ్బందిది. ఐతే కమర్షియల్ సినిమాల్లో ఇలాంటివన్నీ సహజం అనుకుని ఇలాంటి సైడ్ ట్రాక్స్ సంగతి పక్కన పెట్టేస్తే.. హీరోకు ఒక లక్ష్యం ఏర్పరిచి.. దాని కోసం అతను పాటుపడే క్రమాన్ని ‘పెద్ది’లో చాలా బాగా చూపించాడు బుచ్చిబాబు. హీరోకు ఒక లక్ష్యం ఏర్పడడానికి ఉత్ప్రేరకంలా మారే అప్పలసూరి పాత్ర.. అందులో జగపతిబాబు పెర్ఫామెన్స్.. ఆ పాత్రకు ఇచ్చిన ట్విస్ట్ ‘పెద్ది’లో హైలైట్. ఇంటర్వెల్లో బలంగా ఎమోషన్ పండడానికి జగపతిబాబు పాత్ర ఎంతగానో ఉపయోగపడింది. రామ్ చరణ్ మాస్ పెర్ఫామెన్సులో పీక్స్ ను ఈ ఎపిసోడ్లో చూడొచ్చు. ప్రథమార్ధంలో క్రికెట్ సన్నివేశాలు హీరో పాత్రకు మంచి ఎలివేషన్ ఇవ్వడంతో పాటు వినోదాన్ని పంచుతాయి. తర్వాత జగపతిబాబు పాత్ర చుట్టూ అల్లిన ఎమోషనల్ ఎపిసోడ్ విరామ సమయానికి ‘పెద్ది’ రసకందాయంలో పడేలా చేస్తుంది. ఒక పీక్ ఎమోషనల్ సీన్ తర్వాత ఆ ఇంటెన్సిటీని ద్వితీయార్ధంలో కొనసాగించడంలో బుచ్చిబాబు కొంచెం తడబడ్డాడు కానీ.. కుస్తీ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలను చాలా ఎఫెక్టివ్ గా తీయడం ద్వారా బాగానే కిక్కిచ్చాడు. ఆట పరంగా సినిమాలో అసలైన హై ఇచ్చేది కుస్తీ పోటీలే. ఆటను.. అందులో మలుపులను లోతుగా.. రసవత్తరంగా చూపించడం ద్వారా బుచ్చిబాబు దర్శకుడిగా తన పనితనాన్ని చాటాడు. ప్రథమార్ధంలో జాన్వి పాత్రతో ముడిపడ్డ సన్నివేశాల్లాగే సెకండాఫ్ లో అసందర్భంగా వచ్చిపడే ఐటెం సాంగ్ సైతం ‘పెద్ది’ని సైడ్ ట్రాక్ పట్టించేదే. కానీ తర్వాత చివరి 40 నిమిషాలు ఎంతో ఎమోషనల్ గా సాగుతూ ‘పెద్ది’ గ్రాఫ్ ను పెంచుతాయి. తన తొలి సినిమా తరహాలోనే బుచ్చిబాబు ఇందులోనూ హీరో పాత్రకు సంబంధించి ఒక ‘షాక్’ ఇస్తాడు. అది కొంచెం ఫోర్స్డ్ గా అనిపించినా సరే.. పతాక సన్నివేశాల్లో ఎమోషన్ పండించడంలో.. ప్రేక్షకులను కదిలించడంలో బుచ్చిబాబు దర్శకుడు అయ్యాడు. ఒక ఊరి రాతను మార్చే కథలో ఆ ఊరి జాగ్రఫీని.. అక్కడి మనుషుల జీవన విధానాన్ని సరిగా చూపించకపోవడం ‘పెద్ది’లో మైనస్. ఆ పని చేస్తే భావోద్వేగాలు ఇంకా బాగా పండేవి. దివ్యేందు కొన్ని ముఖ్య పాత్రలను సరిగా ఉపయోగించుకోకపోవడమూ ప్రతికూలతే. కానీ సినిమాలో ఎన్ని లోపాలున్నప్పటికీ పెద్ది పాత్ర.. అందులో రామ్ చరణ్ పెర్ఫామెన్స్ సినిమాను నిలబెట్టాయి. కానీ మూడు గంటలకు పైగా నిడివిలో బోరింగ్ మూమెంట్స్ లేకపోవడం.. కథ ఎక్కడా స్టక్ అయిపోకుండా ముందే సాగడం వల్ల ‘పెద్ది’ చూసినందుకు రిగ్రెట్స్ ఏమీ ఉండవు. కాకపోతే టీం ప్రాజెక్ట్ చేసినట్లుగా ఇది ‘గొప్ప’ సినిమాగా నిలుస్తుందా అన్నది మాత్రం సందేహమే. నటీనటులు: పెద్ది అనే పాత్రను ఎంతో ఎత్తులో నిలబెట్టిన ఘనతను దర్శకుడి కంటే ముందు రామ్ చరణ్‌కు ఇవ్వాలి. ఒక నటుడు ఒక పాత్రను ఓన్ చేసుకుంటే.. దాని కోసం ప్రాణం పెడితే.. సినిమాలో లోటుపాట్లను కూడా మరిచిపోయేంతగా ఆ పాత్ర ఇంపాక్ట్ చూపిస్తుందనడానికి ‘పెద్ది’ ఉదాహరణ. శారీరకంగా తను పడ్డ కష్టమంతా తెరపై కనిపిస్తుంది. క్యారెక్టర్ కోసం ఇంతలా కష్టపడే స్టార్ హీరోలు అరుదుగా ఉంటారు. బాడీ ట్రాన్స్ఫర్మేషన్ అంతా ఒకెత్తయితే.. పెర్ఫామెన్స్ మరో ఎత్తు. పెద్ది పాత్రలోని అమాయకత్వం కొన్ని చోట్ల ‘రంగస్థలం’లో చిట్టిబాబును గుర్తు చేస్తుంది కానీ.. పెద్ది స్పెషాలిటీ పెద్దిదే. ఈ పాత్రలో రామ్ చరణ్‌ను ప్రేక్షకులు చాలా ఏళ్ల పాటు గుర్తుంచుకుంటారనడంలో సందేహం లేదు. జాన్వి కపూర్ కేవలం అందాల ఆరబోతకు.. రెండు పాటలకు మాత్రమే ఉపయోగపడింది. తన పెర్ఫామెన్స్ గురించి చెప్పడానికేమీ లేదు. గౌర్నాయుడు పాత్రలో శివరాజ్ కుమార్ బాగానే నటించాడు కానీ.. ఆయన్నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తాం. అప్పలసూరి పాత్రలో జగపతిబాబు గుర్తుపట్టలేని విధంగా కనిపించడమే కాక.. నటన పరంగా తనలో మరో కోణాన్ని ఆవిష్కరించాడు. నిడివి తక్కువ అయినా.. ఆ పాత్ర వేసిన ఇంపాక్ట్ బలమైంది. ‘మీర్జాపూర్’ ఫేమ్ దివ్యేందు పాత్ర మొదట్లో ఎన్నో అంచనాలు రేకెత్తించి.. తర్వాత సైడ్ అయిపోయింది. తన నటన ఓకే. ఉపేంద్ర లిమాయే బాగా చేశాడు. రావు రమేష్.. సత్య సహా చాలామంది ఆర్టిస్టులకు వాళ్ల స్థాయికి తగ్గ పాత్రలు.. సన్నివేశాలు పడలేదు. సాంకేతిక వర్గం: ‘పెద్ది’ కోసం బుచ్చిబాబు ఏరి కోరి ఏఆర్ రెహమాన్ ను ఎంచుకున్నందుకు ఆయన మంచి ఔట్ పుటే ఇచ్చాడు. ‘చికిరి’ సహా పాటలన్నీ బాగున్నాయి. వాటి చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. రెహమాన్ బీజీఎం అదిరిపోయింది. సినిమాలో తొలి ఫైట్ సందర్భంగా.. అలాగే ప్రి ఇంటర్వెల్ ఎపిసోడ్లో ఆర్ఆర్ ప్రేక్షకుల్లో ఎక్కడ లేని ఉత్తేజం తెస్తుంది. మొత్తంగా సినిమాలో రెహమాన్ స్కోర్ చాలా బాగా సాగింది. రత్నవేలు విజువల్స్ సాంకేతికంగా సినిమాలో మరో హైలైట్. ఆర్ట్ వర్క్ బాగుంది. సీజీ కొంచెం నిరాశపరుస్తుంది. నిర్మాణ విలువలకేమీ ఢోకా లేదు. కొత్త నిర్మాత సతీష్ కిలారు రాజీ ఎక్కడా రాజీ పడకుండా టాప్ క్లాస్ సినిమా తీశాడు. ఇక రైటర్ కమ్ డైరెక్టర్ బుచ్చిబాబు.. తొలిసారి ఒక పెద్ద స్టార్‌ను డైరెక్ట్ చేస్తూ ఆ స్టార్ స్థాయికి తగ్గ కథనే ఎంచుకున్నాడు. విడివిడిగా కొన్ని ఎపిసోడ్లను డీల్ చేయడంలో తన పనితనాన్ని చాటాడు కానీ.. తన తొలి చిత్రం తరహాలో నరేషన్లో ‘క్లాస్’ చూపించలేకపోయాడు. కానీ ఒక చిన్న సినిమా అనుభవంతో ఇంత పెద్ద ప్రాజెక్టును డీల్ చేసిన విధానానికి.. రామ్ చరణ్ నుంచి అద్భుతమైన పెర్ఫామెన్స్ రాబట్టుకున్న తీరుకు బుచ్చిబాబు అభినందనీయుడే. చివరగా: పెద్ది.. ‘ఆట’ను మించిన ‘ఆటగాడు’ రేటింగ్ – 2.75/5

## మ్యాజికల్ మే అంటూ త్రిష పోస్ట్..



స్టార్ హీరోయిన్ త్రిష తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. తనకు ఎంతో ఇష్టమైన ‘మ్యాజికల్ మే’ నెల జ్ఞాపకాలను, ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. “40 ఏళ్ల వయసులో 25 ఏళ్ల అమ్మాయిలా కనిపించడం గొప్ప కాదు.. 20 ఏళ్ల వయసులో ఉన్న యువతులు 40 ఏళ్ల ప్రాయాన్ని చూసి భయపడకుండా, ఆ వయసు కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసేలా చేయడమే నా లక్ష్యం” అనే వ్యాఖ్యను కూడా జత చేశారు. దీంతో అది చూసిన వారంతా విజయ్ సీఎం అవ్వడంతో మ్యాజికల్ మే అని క్యాప్షన్ పెట్టారని చర్చించుకుంటున్నారు. వీరి రిలేషన్‌పై ఈ పోస్ట్‌తో హింట్ ఇచ్చారని అంటున్నారు.

## దీపికాకు జాన్వీ స్ట్రాంగ్ కౌంటర్?



సినిమా పరిశ్రమలో ప్రస్తుతం అత్యంత చర్చనీయమైన అంశాల్లో వర్క్ కల్చర్ ఒకటి. ముఖ్యంగా బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీల్లో పని గంటలు, షూటింగ్ విధానం, ఆర్టిస్టులపై ఉండే ఒత్తిడి వంటి అంశాలపై తరుచు చర్చ జరుగుతునే ఉంటుంది. అయితే, ఈ చర్చకు కేంద్రబిందువుగా నిలిచింది బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె. స్పిరిట్, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్టుల నుంచి ఆమె తప్పుకున్నారనే వార్తలు వచ్చిన తర్వాత.. పని గంటల వివాదం ఇండస్ట్రీ మొత్తం చర్చనీయంగా మారుతుంది.దీపికా పదుకొణె రోజుకు పరిమిత గంటలే పని చేయాలనే నిబంధన పెట్టారని, షూటింగ్ షెడ్యూల్స్ విషయంలో కొన్ని అభిప్రాయ భేదాలు తలెత్తాయని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో టాలీవుడ్ వర్క్ కల్చర్‌పై రకరకాల కథనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా టాలీవుడ్ లో రోజుకు 12 నుంచి 14 గంటల పాటు షూటింగ్‌లు జరుగుతాయని, ఆర్టిస్టులపై భారీ ఒత్తిడి ఉంటుందని కొందరు వ్యాఖ్యానించారు. అయితే, ఈ వివాదంపై తాజాగా బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు కొత్త మలుపు తిప్పాయి.’దేవర’ సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన ‘పెద్ది’ సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె టాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాలను పంచుకుంది. తెలుగు సినిమా సెట్స్‌లో సమయపాలనకు చాలా ప్రాధాన్యత ఇస్తారని, పనిగంటలను చాలా క్రమబద్ధంగా ప్లాన్ చేస్తారని ఆమె వెల్లడించింది. నటీనటులతో పాటు టెక్నీషియన్ల సంక్షేమాన్ని కూడా ఇక్కడ ఎంతో గౌరవిస్తారని పేర్కొంది. జాన్వీ మాటల్లో చెప్పాలంటే.. టాలీవుడ్‌లో లంచ్ బ్రేక్ అనేది కేవలం పేరుకే ఉండదట. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకునేలా ప్రత్యేక సమయం కేటాయిస్తారట. ఆ తర్వాత మళ్లీ షూటింగ్‌లో పాల్గొనడం వల్ల పనితీరు మరింత మెరుగ్గా ఉంటుందని ఆమె అభిప్రాయపడింది.

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com